


సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 202 పేజిలు : 12, వెల రూ. 5/- ఆదివారం, సెప్టెంబరు 13, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

# సహకారమే బ్రిక్స్ చోదకశక్తి: ప్రధాని మోదీ

- సహకార స్ఫూర్తితోనే బ్రిక్స్ ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సులో నేతల భేటీ
- 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'కు ఏకగ్రీవంగా ఆమోదం
- ఐక్యత చాటుతూ వృక్షోత్సవంలో పాల్గొన్న ప్రపంచ నేతలు
- బ్రిక్స్ 20 ఏళ్ల వేడుకల సందర్భంగా రెండు పోస్టల్ స్టాంపుల విడుదల




న్యూఢిల్లీ : సహకార స్ఫూర్తితో ముందుకు సాగుతూ, మరింత సమ్మిళితమైన, సంపన్నమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు బ్రిక్స్ సభ్యదేశాలు కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో శనివారం ప్రారంభమైన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఐక్యతకు, ఉమ్మడి లక్ష్యాల సాధనకు ఈ వేదిక నిదర్శనమని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల అధినేతలు భారత్ మండపంలో ఏర్పాటు చేసిన వృక్షోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇండోనేషియా అధ్యక్షుడు

(మిగతా 2వ పేజీలో)



## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో లక్షల ఎకరాల అక్రమాలు
- ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు
- దివాలా తీసిన విదేశీ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు
- బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు
- అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22-ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే

(మిగతా 2వ పేజీలో)



## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్: సీఎం రేవంత్

- గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి
- నిర్వహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన
- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం

హైదరాబాద్ : వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావు లేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని

(మిగతా 2వ పేజీలో)



### ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం: కిషన్‌రెడ్డి

- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి
- ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి

fssai

### రెండు ఆహార ఉత్పత్తులపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా.. వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆదేశం

- షాలిమార్స్ ధనియాల పొడిలో అధిక మోతాదులో పురుగుమందుల అవశేషాలు
- ఆక్వాగ్రీ క్యారెజీనన్‌లో ప్రమాదకరమైన కాడ్మియం ఉన్నట్టు గుర్తింపు
- కంపెనీల అప్పీల్ తర్వాత రీ-టెస్టుల్లోనూ ఉత్పత్తులు సురక్షితం కావని నిర్ధారణ

### అమెరికాలో భారత సంతతి మహిళ దారుణ హత్య



- కాలిఫోర్నియాలో భారత సంతతి మహిళ హత్య
- ఏడాదిగా వేధిస్తూ, కాల్చి చంపిన యువకుడు
- నిందితుడు కూడాతుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య
- పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించడంతోనే ఈ దారుణం

## బీఆర్ఎస్ నేతలపై కేసులు.. మిస్ ఇంగ్లాండ్ వ్యవహారం ఏమైంది?: కేటీఆర్

- బీఆర్ఎస్ నేతలపై కేసులపై కేటీఆర్ స్పందన
- కేసులను కోర్టుల్లో ఎదుర్కొంటామని వెల్లడి
- మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై డీజీపీకి ప్రశ్న
- పోలీసులు నిందితులను కాపాడుతున్నారా? అని నిలదీత
- మిల్లా మ్యాగీ ఆరోపణలతో గతంలో రాజకీయ దుమారం



హైదరాబాద్ : అసెంబ్లీ ప్రాంగణంలో ఇటీవల జరిగిన గందరగోళం నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటామని చెప్పారు. అయితే హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై ఏం చర్యలు తీసుకున్నారని రాష్ట్ర డీజీపీని ప్రశ్నించారు. "ఈ చెత్త కేసును మేం కోర్టుల్లో ఎదుర్కొంటాం. కానీ హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సమయంలో

(మిగతా 2వ పేజీలో)



## అల్పపీడనం ఎఫెక్ట్.. తెలంగాణలో భారీ వర్షాలు!

- ఉత్తర, తూర్పు జిల్లాలపై అధిక ప్రభావం
- హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

హైదరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండు రోజులు విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. శని, ఆదివారాల్లో (సెప్టెంబర్ 12, 13) రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే

(మిగతా 2వ పేజీలో)

## బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

- తెలంగాణ భవన్‌లో 'నమూనా అసెంబ్లీ' నిర్వహించిన బీఆర్ఎస్
- సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు
- మాజీ మంత్రి కొండా సురేఖ తొలగింపుపై తలసాని సెటైర్లు
- 100 రోజుల హామీల అమలుపైనా చురకలు అంటించిన బీఆర్ఎస్
- అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌కు నిరసనగా ఈ కార్యక్రమం



హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి

(మిగతా 2వ పేజీలో)

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY



# బ్రిక్స్ వేదికగా మోదీ-జిన్‌పింగ్ భేటీ.. కలిసి ముందుకు సాగాలన్న చైనా అధ్యక్షుడు

**బ్రిక్స్ సదస్సు వేళ మోదీ, జిన్‌పింగ్ ద్వైపాక్షిక సమావేశం**

**భారత్, చైనా కలిసి నడవాలని పిలుపునిచ్చిన జిన్‌పింగ్**

**మోదీతో 21 సార్లు సమావేశమయ్యానన్న చైనా అధ్యక్షుడు**

**భారత్‌తో దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందాలకు సిద్ధమని ప్రకటన**



న్యూఢిల్లీ : న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్-2026 శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ శనివారం భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ద్వైపాక్షిక అంశాలపై ఈ సందర్భంగా వారు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఇరు నేతలు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సుమారు ఏడేళ్ల విరామం తర్వాత జిన్‌పింగ్ భారత్‌లో పర్యటిస్తుండటంతో ఈ భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా షీ జిన్‌పింగ్ మాట్లాడుతూ, ప్రపంచంలోని రెండు అతిపెద్ద దేశాలైన భారత్, చైనాలు కలిసికట్టుగా సాగాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ వేగవంతమైన అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పరస్పర సహకారంతో, ఒకరి బలాల నుంచి మరొకరు నేర్చుకుంటూ పురోగమించాలని ఆయన సూచించారు. భారత్‌తో దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకునేందుకు చైనా సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. బ్రిక్స్ సదస్సు ఆహ్వానం తన పుట్టినరోజు నాడే అందిందని జిన్‌పింగ్ గుర్తు చేసుకున్నారు. ప్రధాని మోదీతో తాను ఇప్పటివరకు 21 సార్లు సమావేశమయ్యానని, తమ నాయకత్వంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు స్థిరమైన దిశలో పయనిస్తున్నాయని ఆయన వివరించారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధంపై కూడా జిన్‌పింగ్ స్పందించారు. ఈ యుద్ధం వల్ల ఆ ప్రాంతంలోని ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇది అంతర్జాతీయ సమాజ ప్రయోజనాలకు విఘాతమని అన్నారు. శాశ్వత, సమగ్ర కాల్పుల విరమణ దిశగా రాజకీయ పరిష్కారం కోసం అన్ని పక్షాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు బ్రిక్స్ సభ్య దేశాలతో కలిసి చైనా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ, బ్రిక్స్ అధ్యక్ష హోదాలో భారత్‌కు అందించిన మద్దతు, సహకారానికి చైనాకు కృతజ్ఞతలు తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చించేందుకు ఈ సమావేశం ఒక చక్కని వేదికగా నిలిచిందని, చైనాతో పలు కీలక అంశాలను ప్రస్తావించినట్లు ఆయన వెల్లడించారు. బ్రిక్స్ సమ్మిట్ నేపథ్యంలో చైనా అందించిన మద్దతు, సహకారానికి జిన్‌పింగ్‌కు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. ద్వైపాక్షిక సహకారంపై చర్చించేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.

**వచ్చే ఏడాది బ్రిక్స్‌కు చైనా సారథ్యం**

బ్రిక్స్ కూటమికి 2027లో చైనా అధ్యక్షత వహించనుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని నిర్మించి భవిష్యత్ ప్రణాళికలు రచిస్తామని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ శనివారం ప్రకటించారు. వచ్చే ఏడాది జరగనున్న 19వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు కూడా చైనానే ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ విషయాన్ని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ 'ఎక్స్' వేదికగా ధ్రువీకరించారు. బ్రిక్స్ సహకారంలో మూడో స్వర్ణ దశాబ్దానికి నాంది పలుకుతామని జిన్‌పింగ్ పేర్కొన్నట్లు ఆమె తెలిపారు.

# 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం: శ్రీధర్ బాబు

## హైదరాబాద్ లో వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నామన్న శ్రీధర్ బాబు

## దీని కోసమే క్యూర్ యాక్ట్ 2026ను రూపొందించామని వెల్లడి

## హైదరాబాద్ ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ సిటీగా ఎదిగిందన్న మంత్రి



హైదరాబాద్ నగరంలో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకోసమే ప్రత్యేకంగా 'క్యూర్ యాక్ట్- 2026' శాసనాన్ని రూపొందించినట్లు శాసనసభలో ఆయన వెల్లడించారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజా సమన్వయంతో ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ఎదిగిందని మంత్రి కొనియాడారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్... రాష్ట్ర ఆర్థిక రంగానికి ప్రధాన గ్రోత్ ఇంజన్ అని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని... ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని ఆర్థిక గణాంకాలతో వివరించారు. ప్రస్తుతం నగరం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించిన నేపథ్యంలో మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్మాణంచేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక శాఖలను ఒకే గొడుగు కిందకు తెచ్చి నగరపాలనను అంతర్జాతీయ ప్రమాణాలకు చేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ నేతలపై కేసులు.. మిస్ ఇంగ్లాండ్ వ్యవహారం ఏమైంది?: కేటీఆర్

మిస్ ఇంగ్లాండ్‌తో అభ్యంతరకరంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులపై ఆమె చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఏమయ్యాయి?" అని కేటీఆర్ ప్రశ్నించారు. నిందితులను తెలంగాణ పోలీసులు ఇంకా కాపాడుతున్నారా? దీనిపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వద్ద సమాధానం ఉందా? అని నిలదీశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. అసెంబ్లీ గేటు ముందు జరిగిన గందరగోళం నేపథ్యంలో ముఖ్యమంత్రి తన పోలీసులతో బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని కేటీఆర్ ఆరోపించారు. 2025లో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలంటూ తనపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై ఆరోపించారు. "మేం పోటీలకు వచ్చామో, దేనికి వచ్చామో అర్థం కాలేదు. ఇవేం పోటీలు?" అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు ఎదురైన అసౌకర్యంతో మిస్ వరల్డ్ 2025 పోటీల నుంచి మ్యాగీ అర్ధాంతరంగా వైదొలిగి ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయారు. స్వదేశానికి చేరుకున్న తర్వాత ఆమె చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో రాజకీయ దుమారానికి దారితీశాయి. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. మ్యాగీ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం సైతం సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామాలపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు.

## బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. "100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

## అల్పపీడనం ఎఫెక్ట్.. తెలంగాణలో భారీ వర్షాలు!

ప్రమాదం ఉందని హెచ్చరించింది. దక్షిణ ఒడిశా తీరం, వాయవ్య-పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈ అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది రానున్న 24 గంటల్లో మరింత బలపడి, పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా విదర్భ వైపు వెళ్తుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావం రాష్ట్రంలో సెప్టెంబర్ 14 వరకు ఉంటుందని, ముఖ్యంగా 12, 13 తేదీల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. ఈ అల్పపీడనం ప్రభావంతో ఆదిలాబాద్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల 50 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. మిగతా జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో ప్రభావం తక్కువగా ఉండవచ్చని అధికారులు తెలిపారు. ఇక రాజధాని హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళల్లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడొచ్చని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

### రెండు ఆహార ఉత్పత్తులపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా..

## వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆదేశం

### షాలిమార్స్ ధనియాల పొడిలో అధిక మోతాదులో పురుగుమందుల అవశేషాలు

**ఆక్వాగ్రి క్యారెజీనన్‌లో ప్రమాదకరమైన కాడ్మియం ఉన్నట్టు గుర్తింపు**

**కంపెనీల అప్పీల్ తర్వాత రీ-టెస్టుల్లోనూ ఉత్పత్తులు సురక్షితం కావని నిర్ధారణ**

**ఫుడ్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తున్నందున తక్షణ చర్యలు**

రెండు ప్రముఖ కంపెనీలకు చెందిన ఆహార ఉత్పత్తులు వినియోగదారుల ఆరోగ్యానికి సురక్షితం కావని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) శనివారం వెల్లడించింది. ప్రయోగశాల పరీక్షల్లో ఈ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలను అందుకోవడంలో విఫలమవడంతో, వాటిని తక్షణమే మార్కెట్ నుంచి వెనక్కి తీసుకోవాలని (రీకాల్) సదరు కంపెనీలను ఆదేశించింది. నీలగిరి ఆయిల్ అండ్ అల్లైడ్ ఇండస్ట్రీస్‌కు చెందిన 'షాలిమార్స్ చెఫ్ – కొరియాండర్ పౌడర్', ఆక్వాగ్రి ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 'క్యారెజీనన్' ఉత్పత్తులను నిలిపివేయాలని స్పష్టం చేసింది. నీల్‌గిరి ఆయిల్ కంపెనీ ప్రాంగణం నుంచి సేకరించిన 'షాలిమార్స్ చెఫ్' ధనియాల పొడి నమూనాలను పరీక్షించగా, అందులో అనుమతించిన పరిమితికి మించి పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు తేలింది. దీంతో ఈ ఉత్పత్తి ఆరోగ్యానికి సురక్షితం కాదని అధికారులు వర్గీకరించారు. అయితే, అధికారుల నిర్ణయంపై సదరు కంపెనీ అప్పీల్ చేయడంతో మరోసారి పరీక్షలు నిర్వహించగా, అప్పుడు కూడా ఫలితాల్లో ఎటువంటి మార్పు రాలేదు. దీంతో ఈ ఉత్పత్తి ప్రమాదకరమైనదేనని ఎఫ్ఎస్ఎస్ఏఐ పునరుద్ఘాటించింది. మరో కేసులో, ఆక్వాగ్రి ప్రాసెసింగ్ సంస్థ నుంచి సేకరించిన 'క్యారెజీనన్ (ఎర్రసముద్రం నుంచి సేకరించిన సీవీడ్ ఉత్పత్తి)' నమూనాలో అనుమతించిన స్థాయి కంటే ఎక్కువగా కాడ్మియం ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ కంపెనీ కూడా అప్పీల్ చేయగా, రిఫరల్ ల్యాబొరేటరీలో జరిపిన రీ-టెస్టింగ్‌లోనూ సదరు ఉత్పత్తి సురక్షితం కాదని తేలింది. ఈ రెండు ఉత్పత్తులు ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ రీకాల్ ప్రొసీజర్) రెగ్యులేషన్స్, 2017 ప్రకారం, ఈ ఉత్పత్తులను మార్కెట్ నుంచి తక్షణమే ఉపసంహరించుకోవాలని సంబంధిత కంపెనీలను ఆదేశించింది.

## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

## సహకారమే బ్రిక్స్ చోదకశక్తి: ప్రధాని మోదీ

ప్రబోవో సుబియాంటో, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో పాటు ఇతర సభ్య, భాగస్వామ్య దేశాల నేతలు ప్రధాని మోదీతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నేతలందరూ ఒకరి చేతులు మరొకరు పట్టుకుని సామూహిక చిత్రానికి (గ్రూప్ ఫొటో) పోజులిచ్చి, తమ ఐక్యతను చాటిచెప్పారు. సదస్సులో భాగంగా 'సమ్మిళిత ప్రపంచ పాలన, బహుపాక్షికతను బలోపేతం చేయడం' అనే అంశంపై చర్చలు జరిగాయి. ఈ భేటీలో "న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026"ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. బ్రిక్స్ కూటమి ఏర్పాటై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు ప్రత్యేక పోస్టల్ స్టాంపులను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "ఈ డిక్లరేషన్ మన ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మానాలను సత్ఫలితాలుగా మార్చడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్: సీఎం రేవంత్

రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

### అమెరికాలో భారత సంతతి మహిళ దారుణ హత్య

అమెరికాలో భారత సంతతికి చెందిన మహిళ దారుణ హత్యకు గురయ్యారు. కాలిఫోర్నియాలోని శాక్రమెంటోలో నివాసముంటున్న 38 ఏళ్ల షాలినీ ఠాకూర్‌ను, గత ఏడాది కాలంగా వేధిస్తున్న ఓ యువకుడు నడిరోడ్డుపై కాల్చి చంపాడు. అనంతరం నిందితుడు కూడా తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘోర ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఆర్డెన్-ఆర్కేడ్ ప్రాంతంలోని పనేరా బ్రెడ్ రెస్టారెంట్ వెలుపల మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. 22 ఏళ్ల రోహిత్ అనే నిందితుడు షాలినీని వెంబడించి, అందరూ చూస్తుండగానే ఆమెపై పలుమార్లు కాల్పులు జరిపాడు. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. హత్య అనంతరం నిందితుడు ఘటనా స్థలం నుండి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు హైవే-50 వద్ద అతడిని గుర్తించి చుట్టుముట్టారు. ఆ సమయంలో రోహిత్ తన వద్దనున్న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిందితుడిపై తాము ఎటువంటి కాల్పులు జరపలేదని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. దాదాపు ఏడాది కాలంగా రోహిత్ తన కుమార్తెను నిరంతరం వేధిస్తున్నాడని షాలినీ తల్లి సుధేష్ కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. తనను పెళ్లి చేసుకోవాలని రోహిత్ ఆమెపై తీవ్ర ఒత్తిడి తెచ్చాడని, అయితే వయసులో వ్యత్యాసం ఉండటంతో షాలినీ అందుకు నిరాకరించిందని తెలిపారు. అతడి వేధింపుల కారణంగా తన కుమార్తె గత కొంతకాలంగా తీవ్ర భయాందోళనల మధ్య గడిపిందని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. కోర్టు రికార్డుల ప్రకారం, 2025 సెప్టెంబర్ నుంచి రోహిత్ వేధింపులు మొదలయ్యాయి. షాలినీ పనిచేసే చోట డోర్‌డాష్ పికప్‌ల ద్వారా అతడికి ఆమెతో పరిచయం ఏర్పడింది. ఇంటి వెలుపల గంటల తరబడి వేచి చూడటం, కారు టైర్లలో గాలి తీయడం, ఆమె కదలికలను పసిగట్టేందుకు కారుకు యాపిల్ ఎయిర్ ట్యాగ్ అమర్చడం వంటి చర్యలకు అతడు పాల్పడేవాడు. అంతేకాకుండా, షాలినీ ఫ్లాట్‌కు డూప్లికేట్ తాళం తయారు చేయించి, ఆమె నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి ప్రవేశించేవాడని సమాచారం. ఈ వేధింపులపై షాలినీ మే 19న కోర్టు నుంచి రిస్ట్రెయినింగ్ ఆర్డర్ కూడా పొందారు. అయినప్పటికీ నిందితుడు తన ప్రవర్తన మార్చుకోకుండా ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. హత్యకు గురవడానికి గంట ముందే షాలినీ తన తల్లితో ఫోన్‌లో మాట్లాడిందని, 15 నిమిషాల్లో తిరిగి కాల్ చేస్తానని చెప్పిన కూతురు ఇలా విగతజీవిగా మారడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం: కిషన్‌రెడ్డి



ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
ఆదివారం, సెప్టెంబరు 13, 2026



## తెలంగాణపై ఎల్‌నినో ప్రభావం

తెలంగాణలో వర్షం అంటే కేవలం ఆకాశం నుంచి పడే నీరు కాదు. అది రైతు పెట్టుబడి. అది పంటకు ప్రాణం. అది చెరువుకు నింపు. అది భూగర్భజలానికి ఆధారం. అది పట్టణాలకు తాగునీరు. అది విద్యుత్తు ఉత్పత్తికి ఒక ఆధారం. అందుకే వర్షపాతంలో వచ్చే చిన్న మార్పు కూడా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెద్ద ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో ఎల్‌నినో పరిస్థితులు తెలంగాణకు హెచ్చరికను ఇస్తున్నాయి. అయితే ఎల్‌నినో అంటే కచ్చితంగా కరువు వస్తుందని చెప్పడం శాస్త్రీయంగా సరైనది కాదు. భారత వర్షపాతంపై ఎల్‌నినో ప్రభావం ప్రాంతానికో రకంగా ఉంటుంది. తెలంగాణలోనూ ప్రభావం ఒకే విధంగా ఉండకపోవచ్చు. భారత వాతావరణ శాఖ గత నెలల్లో ఎల్‌నినో పరిస్థితులు బలపడే అవకాశం, వర్షపాతంలో మార్పులు ఉండే అవకాశం గురించి సూచించింది. అందుకే అసలు ప్రశ్న 'వర్షం పడుతుందా?' అన్నది కాదు. 'వర్షం ఎలా పడుతుంది?' అన్నదే.

### ఎల్‌నినో అంటే ఏమిటి?

సాధారణంగా ప్రజలకు ఎల్‌నినో అంటే వర్షాలు తగ్గించే వాతావరణ పరిస్థితి అనే భావన ఉంది. కానీ ఇది అంత సులభమైన సమీకరణ కాదు. పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం, దానికి అనుసంధానంగా వాతావరణ ప్రసరణలో మార్పులు రావడం ఎల్‌నినోకు ప్రధాన లక్షణాలు. ఈ మార్పులు ప్రపంచంలోని అనేక ప్రాంతాల వాతావరణంపై ప్రభావం చూపుతాయి. భారతదేశంలో సాధారణంగా ఎల్‌నినో సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశాన్ని వాతావరణ శాస్త్రవేత్తలు పరిశీలిస్తారు. అయితే ప్రతి ఎల్‌నినో సంవత్సరంలో ఒకే రకమైన పరిస్థితి ఉండదు. భారత వాతావరణ శాఖ గణాంకాల్లో కూడా ఎల్‌నినో సంవత్సరాల మధ్య వర్షపాతంలో గణనీయమైన తేడాలు కనిపిస్తాయి. అంటే ఎల్‌నినోను భయపెట్టే పదంగా కాకుండా, ముందస్తు ప్రణాళికకు ఉపయోగపడే సంకేతంగా చూడాలి.

### తెలంగాణకు ఎందుకు ప్రత్యేక సవాలు?

తెలంగాణ భౌగోళిక పరిస్థితులు ఇతర రాష్ట్రాలకంటే భిన్నంగా ఉంటాయి. విస్తారమైన ప్రాంతం వర్షాధార వ్యవసాయంపై ఆధారపడి ఉంది. చెరువులు, చిన్న జలాశయాలు, భూగర్భజలాలు వ్యవసాయానికి కీలకం. వర్షం సరైన సమయంలో పడకపోతే విత్తనం వేసిన రైతు నష్టపోవచ్చు. వర్షం ఆలస్యంగా వచ్చి ఒక్కసారిగా భారీగా కురిస్తే కూడా పంటకు నష్టం కలగవచ్చు.

### ఇదే ఎల్‌నినో ప్రభావాన్ని అర్థం చేసుకోవడంలో ముఖ్యమైన అంశం.

వర్షపాతం మొత్తం పరిమాణం కంటే దాని పంపిణీ రైతుకు ఎక్కువ ముఖ్యం. ఉదాహరణకు ఒక నెలలో సాధారణం కంటే తక్కువ వర్షం పడినా, తరువాతి కొన్ని రోజుల్లో భారీ వర్షాలు పడితే మొత్తం వర్షపాతం లెక్క సాధారణానికి దగ్గరగా కనిపించవచ్చు. కానీ ఆ నీరు భూమిలో నిలవకపోతే వ్యవసాయానికి ప్రయోజనం తక్కువ. పైగా భారీ వర్షం వల్ల నేల కోత, పంట నష్టం, వాగులు పొంగడం వంటి సమస్యలు వస్తాయి. అందువల్ల వాతావరణ మార్పుల కాలంలో 'సగటు వర్షపాతం' అనే ఒక్క సంఖ్యతో పరిస్థితిని అంచనా వేయడం సరిపోదు. విత్తనాలు వేసే సమయం రైతుకు కీలకం. సరైన తేమ లేకుండా విత్తనం వేస్తే మొలక సమస్య. వర్షం కోసం వేచి చూస్తే సాగు కాలం తగ్గిపోతుంది. తరువాత పంటకు అవసరమైన వర్షం రాకపోతే దిగుబడి పడిపోతుంది. వర్షం ఒకసారి బాగా పడటం మాత్రమే పంటకు సరిపోదు. మొక్క ఎదుగుదలలో కీలక దశల్లో తగినంత తేమ అవసరం. రెండు వర్షాల మధ్య ఎక్కువ విరామం వస్తే పంటపై ఒత్తిడి పెరుగుతుంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో తక్కువ సమయంలో ఎక్కువ వర్షం పడే సంఘటనలు పెరుగుతున్నాయి. అలాంటి వర్షం చెరువులను నింపినా, పంట పొలాల్లో నీరు నిలిచినా, నేల కొట్టుకుపోయినా రైతుకు లాభం కన్నా నష్టం ఎక్కువ కావచ్చు.

### నీటి నిర్వహణలో పాత పద్ధతులు సరిపోవు

తెలంగాణలో చెరువుల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణం వంటి కార్యక్రమాలు జరిగాయి. కానీ వాతావరణ పరిస్థితులు మారుతున్నప్పుడు నీటి నిర్వహణను కూడా మార్చుకోవాలి. ప్రతి వర్షపు నీటిని జలాశయంలోకి తీసుకెళ్లడం మాత్రమే లక్ష్యం కాకూడదు. గ్రామ స్థాయిలో వర్షపు నీటిని భూమిలోకి చొప్పించే చర్యలు పెరగాలి. చెరువుల పూడికతీత, వాగుల సంరక్షణ, చెక్‌డ్యామ్‌లు, భూగర్భజల పునరుద్ధరణ, పంట పొలాల్లో నీటి నిల్వ వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షం పడిన రోజే నీటిని పారబోయడం, తరువాత ఎండాకాలంలో నీటి కోసం బోర్లు తవ్వడం అనే చక్రం నుంచి బయటపడాలి.

# ఢిల్లీలో బ్రిక్స్ సమావేశం
# మారుతున్న ప్రపంచంలో భారత్ దిశ

ప్రపంచం మరోసారి మార్పు దశలో ఉంది. ఒకవైపు యుద్ధాలు, మరోవైపు వాణిజ్యపరమైన ఆంక్షలు, ఇంకోవైపు సాంకేతిక ఆధిపత్యం.. వీటన్నింటి మధ్య అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ స్వరాన్ని మరింత బలంగా వినిపించాల్సిన అవసరం ఏర్పడింది. ఇలాంటి సమయంలో ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. గతంలో ప్రధానంగా ఆర్థిక సహకారం, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాల వేదికగా కనిపించిన బ్రిక్స్ ఇప్పుడు ప్రపంచ రాజకీయాలు, భద్రత, వాణిజ్యం, ఇంధనం, సాంకేతికత, అంతర్జాతీయ సంస్థల సంస్కరణ వంటి విస్తృత అంశాలపై ప్రభావం చూపించే వేదికగా మారుతోంది. భారత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం కేవలం ఒక అంతర్జాతీయ సమావేశం కాదు. మారుతున్న ప్రపంచ వ్యవస్థలో భారత్ తన స్థానాన్ని ఎలా నిర్మించుకుంటుందో చూపించే ఒక ముఖ్యమైన సందర్భం. పదకొండు దేశాలతో విస్తరించిన బ్రిక్స్‌లో ప్రతి దేశానికీ తనదైన ప్రయోజనాలు ఉన్నాయి. చైనా, రష్యా, ఇరాన్ వంటి దేశాలు ఒక వైపు పాశ్చాత్య ఆధిపత్యానికి ప్రత్యామ్నాయ ప్రపంచ వ్యవస్థను కోరుతున్నాయి. మరోవైపు భారత్ అమెరికా, యూరప్‌తోనూ వ్యూహాత్మక సంబంధాలను కొనసాగిస్తూ, రష్యాతోనూ చారిత్రక సంబంధాలను కాపాడుకుంటోంది. ఈ విభిన్న ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించడం చిన్న విషయం కాదు.



**ఢిల్లీలో ఆమోదించిన కొత్త ఢిల్లీ ప్రకటనలో అంతర్జాతీయ వివాదాలకు సంభాషణ, దౌత్యం ద్వారా పరిష్కారం కనుగొనాలని పిలుపునివ్వడం ఈ సమావేశం స్వభావాన్ని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు, ఏకపక్ష ఆంక్షలు, వాణిజ్య ఆంక్షలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావాన్ని కూడా సభ్య దేశాలు ప్రస్తావించాయి. 140 అంశాలతో కూడిన ప్రకటనలో ప్రపంచ పాలనా వ్యవస్థ సంస్కరణ, ఇంధన మార్పు, వాణిజ్యం, అభివృద్ధి, ఉగ్రవాదం వంటి అనేక అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు.**

### కూటమి పెరిగింది.. బాధ్యత కూడా పెరిగింది

బ్రిక్స్ విస్తరణ ఈ సమావేశానికి మరో ప్రత్యేకత. ఒకప్పుడు బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో ఉన్న ఈ వేదిక ఇప్పుడు ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలతో విస్తరించింది. సభ్య దేశాల సంఖ్య పెరగడం వల్ల బ్రిక్స్ ఆర్థిక పరిమాణం, భౌగోళిక పరిధి, రాజకీయ ప్రాధాన్యం పెరిగాయి. అయితే అదే సమయంలో అభిప్రాయ భేదాలకు కూడా అవకాశం పెరిగింది. ఒకే వేదికపై భారత్, చైనా ఉన్నారు. చైనా, అమెరికా మధ్య వ్యూహాత్మక పోటీ కొనసాగుతోంది. రష్యా పాశ్చాత్య దేశాలతో తీవ్రమైన విభేదాల్లో ఉంది. ఇరాన్ పశ్చిమాసియా సంక్షోభంలో కీలక పాత్రలో ఉంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మరోవైపు పశ్చిమ దేశాలతోనూ బలమైన సంబంధాలు కొనసాగిస్తోంది. ఇలాంటి విభిన్న పరిస్థితుల్లో బ్రిక్స్ ఒకే గొంతుతో మాట్లాడటం సులభం కాదు. అందుకే ఢిల్లీ సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చిన అంశాలు ముఖ్యమైనవే. అయితే ప్రకటనలు రావడం ఒక దశ మాత్రమే. ఆ ప్రకటనల్లోని అంశాలను ఆచరణలోకి తీసుకురావడమే అసలు పరీక్ష.



-గుర్రం పాపిరెడ్డి
ఎడిటర్

## అంతరించిపోయిన జీవిపై కీలక పరిశోధన.. అమెరికన్ చీతాపై వీడిన మిస్టరీ



"అమెరికన్ చీతా"గా పిలుస్తున్న అంతరించిన ఒక జీవి, వాస్తవానికి చీతా జాతికి చెందినది కాదని, అది ఆధునిక ప్యూమాకు అత్యంత సన్నిహిత సంబంధం కలిగినదని తాజా అధ్యయనంలో తేలింది. పొడవాటి కాళ్లు, వేగంగా పరుగెత్తడానికి అనువైన సన్నని శరీర ఆకృతి ఆఫ్రికన్ చీతాలను పోలి ఉండటంతో దీనికి ఆ పేరు స్థిరపడింది. అయితే, 'కరెంట్ బయాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన ఈ కొత్త అధ్యయనం పాత అంచనాలను పూర్తిగా పటాపంచలు చేసింది. వ్యోమింగ్ నుండి ఒకటి, కెనడాలోని యుకాన్ నుండి మూడు చొప్పున మొత్తం నాలుగు పురాతన శిలాజాల నుంచి సేకరించిన న్యూక్లియర్ డీఎన్ఏను పరిశోధకులు విశ్లేషించారు. ఈ ఫలితాల ఆధారంగా అమెరికన్ చీతా, ఆధునిక ప్యూమాకు ఒకే సంతతికి చెందిన సోదర జాతి అని స్పష్టమైంది. దాదాపు 26 లక్షల సంవత్సరాల క్రితం ఇవి ఒకే వంశం నుంచి విడిపోయాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అసలు చీతాతో ఎటువంటి జన్యుపరమైన సంబంధం లేకపోయినా, ఒకేలా కనిపించడానికి ప్రధాన కారణం "కన్వర్జెంట్ ఎవల్యూషన్".. అంటే, ఒకే రకమైన వాతావరణ పరిస్థితుల్లో (వేగానికి అనుకూలమైన విశాల మైదానాలు) నివసించే సంబంధం లేని జీవులు, కాలక్రమేణా ఒకే విధమైన శారీరక లక్షణాలను పెంపొందించుకోవడం. ఈ జీవి సుమారు 25 లక్షల సంవత్సరాల క్రితం నుంచి 16,000 సంవత్సరాల క్రితం వరకు ఉత్తర అమెరికా ఖండంలో నివసించింది. కెనడాలోని యుకాన్‌లో లభించిన శిలాజాల ఆధారంగా, గతంలో ఊహించిన దానికంటే ఇవి అత్యంత ఉత్తరాన ఉన్న ఆర్కిటిక్ ప్రాంతం వరకు విస్తరించి ఉండేవని తెలిసింది. వీటి ఎముకలపై నిర్వహించిన ఐసోటోప్ విశ్లేషణలో ఆసక్తికరమైన అంశాలు వెలుగుచూశాయి. భౌగోళిక ప్రాంతాలను బట్టి వీటి ఆహారపు అలవాట్లు వేర్వేరుగా ఉండేవని, దక్షిణ ప్రాంతాల్లోని జీవులు శాకాహార జంతువులను వేటాడగా, ఉత్తర ఆర్కిటిక్ ప్రాంతంలోనివి చేపలు వంటి జలచరాలను ఆహారంగా తీసుకున్నట్లు ఆధారాలు లభిస్తున్నాయి. కాలక్రమేణా ఈ జీవులలో జన్యు వైవిధ్యం క్రమంగా తగ్గిపోయింది. దీనివల్ల పర్యావరణ మార్పులకు అనుగుణంగా తమను తాము మలచుకునే సామర్థ్యం క్షీణించడంతో, చివరి మంచు యుగం ముగింపు దశలో సుమారు 16,000 సంవత్సరాల క్రితం ఈ జాతి సంపూర్ణంగా అంతరించిపోయిందని పరిశోధకులు భావిస్తున్నారు. సారాంశంలో, అమెరికన్ చీతా అనేది కేవలం వేటకే పరిమితమైన జీవి కాదని, వైవిధ్యభరితమైన వాతావరణ పరిస్థితులకు అలవాటుపడగల ప్యూమా బంధువని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.

# ఎస్ఐఆర్.. ఒక్క నిజమైన ఓటు కూడా పోకూడదు



ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో సాధారణ హక్కు కాదు. అది పౌరుడి రాజకీయ స్వరం. ఒక ఓటు ఒక ప్రభుత్వాన్ని మార్చగలదు. ఒక ఓటు ఒక అభ్యర్థి గెలుపు ఓటమిని నిర్ణయించగలదు. అందుకే ఓటరు జాబితాలో ఒక పేరు ఉండటం కేవలం పరిపాలనా నమోదు కాదు. అది ఒక పౌరుడి ప్రజాస్వామ్య ఉనికికి గుర్తింపు. ఇలాంటి సమయంలో తెలంగాణలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది.

ఓటరు జాబితాలో మరణించినవారి పేర్లు ఉండటం, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదులు ఉండటం, శాశ్వతంగా వలస వెళ్లినవారి పేర్లు కొనసాగడం వంటి సమస్యలు ఉంటే వాటిని సరిచేయాల్సిందే. పరిశుభ్రమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా లేకుండా స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు జరగడం కష్టం. కానీ అదే సమయంలో అర్హత ఉన్న ఓటరు పేరు పొరపాటున తొలగిపోవడం కూడా అంతే తీవ్రమైన సమస్య.

### ఇదే తెలంగాణ ఎస్ఐఆర్ ప్రక్రియలో అసలు పరీక్ష.

సంఖ్యలు ఎందుకు ఆందోళన కలిగిస్తున్నాయి? తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అనంతరం ముసాయిదా ఓటరు జాబితాలో సుమారు 73.3 లక్షల పేర్లు తొలగించబడినట్లు నివేదికలు వెలువడ్డాయి. ఇవి గైర్హాజరు, వలస, మరణం, పునరావృత నమోదు వంటి కారణాలతో గుర్తించిన పేర్లుగా పేర్కొన్నారు. ఈ సంఖ్య మొత్తం ఓటర్లలో గణనీయమైన వాటా కావడంతో సహజంగానే ప్రజల్లో చర్చ మొదలైంది. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. ముసాయిదా జాబితాలో పేరు లేకపోవడం అంటే ఆ వ్యక్తి ఓటు హక్కు శాశ్వతంగా పోయిందని అర్థం కాదు. అభ్యంతరాలు, దావాలు, సవరణలు, విచారణ వంటి ప్రక్రియలు అందుబాటులో ఉండాలి. అందుకే ముసాయిదా జాబితా దశ అత్యంత కీలకం. అయితే ఇంత పెద్ద సంఖ్యలో పేర్లు ఒకేసారి జాబితా నుంచి బయటకు వచ్చినప్పుడు, సాధారణ పౌరుడికి ప్రక్రియ అర్థమయ్యేలా విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంటుంది.

### శుద్ధి అవసరమే

ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకం ఉండాలంటే ఓటరు జాబితా ఖచ్చితంగా ఉండాలి. మరణించిన వ్యక్తి పేరు కొనసాగితే అది తొలగించాలి. ఒక వ్యక్తి రెండు చోట్ల ఓటరుగా ఉంటే సరైన నమోదును ఉంచి మిగిలినదాన్ని సరిచేయాలి. శాశ్వతంగా వేరే ప్రాంతానికి వెళ్లిన వ్యక్తి నమోదు పరిస్థితిని నిబంధనల ప్రకారం పరిశీలించాలి. నకిలీ నమోదులు ఉంటే వాటిపై చర్య తీసుకోవాలి. ఇది రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా చేసే చర్య కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే చర్య. ఎందుకంటే ప్రతి తప్పు తొలగింపు ఒక నిజమైన పౌరుడి హక్కును ప్రభావితం చేస్తుంది. 'ఇంట్లో లేరు' అంటే 'ఓటరు కాదు' కాదు ఎస్ఐఆర్ ప్రక్రియలో అత్యంత జాగ్రత్తగా చూడాల్సిన అంశం ఇదే. ఉద్యోగం కోసం హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లిన వ్యక్తి ఉండవచ్చు. విదేశాల్లో పని చేస్తున్న కుటుంబ సభ్యుడు ఉండవచ్చు. చదువు కోసం వేరే నగరానికి వెళ్లిన యువకుడు ఉండవచ్చు. అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్న వ్యక్తి ఉండవచ్చు. వృద్ధులు కొన్ని నెలలు బంధువుల వద్ద ఉండవచ్చు. ఒక ఇంటికి వెళ్లిన సమయంలో వ్యక్తి కనిపించలేదని మాత్రమే అతని పేరు తొలగించడానికి అది సరైన కారణం కాకూడదు.

### స్థిరమైన వలస, తాత్కాలిక గైర్హాజరు మధ్య తేడా గుర్తించాలి.

ఇక్కడ స్థానిక స్థాయి పరిశీలన, పొరుగువారి సమాచారం, పత్రాల పరిశీలన, సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వడం వంటి చర్యలు కీలకం.

### ప్రజలకు ప్రక్రియ అర్థం కావాలి

ఎన్నికల ప్రక్రియలో సాధారణ పౌరుడు న్యాయ నిపుణుడు కాదు. అతనికి ఏ దరఖాస్తు ఇవ్వాలి? ఎక్కడ ఇవ్వాలి? ఏ పత్రం అవసరం? ఎప్పటిలోపు ఇవ్వాలి? తన అభ్యంతరం ఎవరికి చెప్పాలి? అన్నది స్పష్టంగా తెలియాలి. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఓటరు జాబితా, పేర్ల శోధన, చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించిన సేవలను అందిస్తోంది. కానీ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో సమాచారం ఉండటం మాత్రమే సరిపోదు. ఇంటర్నెట్ ఉపయోగించలేని వృద్ధులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, అక్షరాస్యత తక్కువగా ఉన్నవారు, వలస కార్మికులు వంటి వర్గాలకు ప్రత్యక్ష సహాయం అవసరం. ప్రతి గ్రామం, ప్రతి వార్డు స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఓటరు జాబితా విషయంలో ప్రభుత్వాన్ని లేదా ఎన్నికల సంఘాన్ని మాత్రమే బాధ్యులను చేయడం సరిపోదు. రాజకీయ పార్టీలకూ బాధ్యత ఉంది. ప్రతి పార్టీకి బూత్ స్థాయి కార్యకర్తలు ఉన్నారు. వారు తమ ప్రాంతంలోని ఓటర్ల జాబితాను పరిశీలించవచ్చు. అర్హులైన ఓటర్ల పేర్లు లేకపోతే వారిని ప్రక్రియలోకి తీసుకురావచ్చు. తప్పు నమోదులను గుర్తించవచ్చు. కానీ ఈ ప్రక్రియ పార్టీ ప్రయోజనాల కోసం మాత్రమే జరగకూడదు. 'మన ఓటరు', 'వారి ఓటరు' అనే విభజన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. అర్హుడైన ప్రతి పౌరుడు ఏ పార్టీకి మద్దతు ఇచ్చినా, ఏ రాజకీయ అభిప్రాయం కలిగి ఉన్నా, అతని ఓటు హక్కు సమానంగా రక్షించబడాలి.

### ఎన్నికల సంఘం మీద ఉన్న పెద్ద బాధ్యత

ఎస్ఐఆర్ విషయంలో ఎన్నికల సంఘం నిష్పాక్షికత అత్యంత కీలకం. ఎన్నికల సంఘంపై ఒక వర్గానికి అనుమానం వచ్చినా అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. అందుకే ప్రతి తొలగింపుకు కారణం స్పష్టంగా ఉండాలి. సంబంధిత వ్యక్తికి సమాచారం అందాలి. అభ్యంతరం చెప్పే అవకాశం ఉండాలి. అవసరమైతే వ్యక్తిగత విచారణ జరగాలి. తుది నిర్ణయం తీసుకునే ముందు అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించాలి. ఇలాంటి పారదర్శకత ఉంటే రాజకీయ విమర్శలు తగ్గుతాయి. ప్రజల విశ్వాసం పెరుగుతుంది.

### సాంకేతికత ఉపయోగపడాలి.. ప్రత్యామ్నాయం కాకూడదు

ఇప్పటి ఎన్నికల వ్యవస్థలో సాంకేతికతకు పెద్ద పాత్ర ఉంది. ఆధార్, చిరునామా, పాత ఓటరు జాబితాలు, డిజిటల్ రికార్డులు వంటి సమాచారాన్ని ఉపయోగించి పునరావృత నమోదులను గుర్తించవచ్చు. కానీ కంప్యూటర్‌లో ఒక పేరు సరిపోలకపోవడం లేదా సమాచారం మారిపోవడం మాత్రమే తుది నిర్ణయానికి ఆధారం కాకూడదు. సాంకేతికత అనుమానాన్ని గుర్తించాలి. మనిషి విచారణ ద్వారా నిజాన్ని నిర్ధారించాలి. యంత్రం ఒక పౌరుడిని అనుమానితుడిగా గుర్తించవచ్చు. కానీ అతని హక్కును తొలగించే తుది నిర్ణయం పారదర్శకమైన మానవ పరిశీలన తర్వాతే ఉండాలి.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
ఆదివారం, సెప్టెంబరు 13, 2026

# భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి

**మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: సిరిసిల్ల డీఎస్పీ కే. నాగేంద్ర చారి**

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 12 (అరుణప్రభ): గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఇందుకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని సిరిసిల్ల డీఎస్పీ కే. నాగేంద్ర చారి సూచించారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని సాయి శివ గార్డెన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటులో నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రతి గణేష్ మండపం వివరాలను గణేష్ పోర్టల్--2026లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుతో ప్రజా రవాణాకు, అత్యవసర సేవల వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.



**ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు.**

ప్రతి గణేష్ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు. మండపాలన్నింటినీ జియో ట్యాగింగ్ చేసి టీజీ-కాప్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు తెలిపారు. జియో ట్యాగింగ్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు మండపాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. గణేష్ విగ్రహం ఏర్పాటు చేసినప్పటి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శోభాయాత్ర సమయంలో పోలీస్ శాఖ రూపొందించిన రూట్ మ్యాప్‌ను తప్పనిసరిగా అనుసరించాలని స్పష్టం చేశారు.

**డీజేలకు అనుమతి లేదు.**

గణేష్ ఉత్సవాల్లో మండపాల వద్ద, శోభాయాత్ర సమయంలో, నిమజ్జన కార్యక్రమంలో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. పోలీసుల అనుమతి లేకుండా డీజేలను వినియోగిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10 గంటల వరకు రెండు చిన్న స్పీకర్లకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యే విధంగా వ్యవహరించరాదని సూచించారు.

**సోషల్ మీడియాలో పోస్టులపై నిఘా**

సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం, ఇతర వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రచారం చేయడం, వాస్తవాలను నిర్ధారించుకోకుండా తప్పుడు సమాచారాన్ని ఫార్వర్డ్ చేయడంపై ప్రత్యేక నిఘా ఉంటుందని డీఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

**విద్యుత్, అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత**

గణేష్ మండపాల నిర్వాహకులు విద్యుత్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు. అవసరమైన మండపాల వద్ద ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఫైర్ బాల్స్, నీటి బకెట్లు వంటి అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఉత్సవాల సమయంలో భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు.**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి సమస్య తలెత్తినా ప్రజలు వెంటనే డయల్--112కు లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. వెంకటేష్, ఎస్సై ఎన్. రమేష్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో తెలంగాణ రెడ్డి సంఘం ఫిర్యాదులి**



అరుణ ప్రభ ఇబ్రహీంపట్నం ఇబ్రహీంపట్నం:- రెడ్లపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రెడ్డి సంఘం ఇబ్రహీంపట్నం మరియు ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. తెలంగాణ రెడ్డి సంఘం అధ్యక్షులు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొట్టం మధుసూధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు అందజేశారు. సెప్టెంబర్ 5న నకిరేకల్ లో ముఖ్యమంత్రి సభ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ, క్యూ న్యూస్ వేదికగా తీన్మార్ మల్లన్న రెడ్లకు నీతి జాతి లేదంటూ అసభ్యకరంగా దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇలాంటి వ్యాఖ్యలు తెలంగాణ సమాజంలో వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు పెంచి, ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసి శాంతిభద్రతల సమస్య తలెత్తేలా ఉన్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి శిక్షించాలని కోరారు. ఈ ఫిర్యాదు కార్యక్రమంలో సుదిని శివరామ్ రెడ్డి, సంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,డి. సురేందర్ రెడ్డి,జి. రమణా రెడ్డి,ఏ. రాజశేఖర్ రెడ్డి, పి. విష్ణువర్ధన్ రెడ్డి, బి. సందీప్ రెడ్డి పి. శ్రీకాంత్ రెడ్డి, కె. శ్రీనివాస్ రెడ్డి ఎం. కృష్ణా రెడ్డి,ఎం. అరుణ్ రెడ్డి, వి. శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్వాల్‌గూడ 119 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొబ్బిలి చంద్రశేఖర్ ముదిరాజ్

**పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తా: బొబ్బిలి చంద్రశేఖర్ ముదిరాజ్**



అరుణ ప్రభ శంషాబాద్ జోన్ జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ కొత్వాల్‌గూడ 119 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బొబ్బిలి చంద్రశేఖర్ ముదిరాజ్ నియమితులయ్యారు. రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొబ్బిలి చంద్రశేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కొత్వాల్‌గూడ 119 డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు. కార్యకర్తలందరినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని తెలిపారు. "కార్యకర్తే పార్టీకి వెన్నెముక" అనే స్ఫూర్తితో ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతానని చంద్రశేఖర్ ముదిరాజ్ పేర్కొన్నారు. కొత్వాల్‌గూడ 119 డివిజన్ కాంగ్రెస్ పార్టీని మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# వసతి గృహమా... లేక ఎలుకల నిలయమా?

**వసతి గృహంలో ఎలుకల కలకలం! విద్యార్థినులపై వరుస దాడులు.. భద్రత గాలిలో!**

**-మూడు రోజుల వ్యవధిలో ఏడుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలించి చికిత్స**

**ఘటనలను ఉన్నతాధికారులకు చెప్పలేదన్న ప్రిన్సిపాల్.. 'చిన్న విషయమే' అంటూ సమర్థింపు**

అరుణ ప్రభ:- సారపాక మైనార్టీ బాలికల కళాశాల వసతి గృహంలో భయాందోళన విద్యార్థినులకు భద్రత కల్పించాల్సిన వసతి గృహమే ఎలుకల దాడులకు నిలయంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాక తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థినులపై ఎలుకలు వరుసగా దాడి చేసిన ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఒకసారి కాదు.. రెండు సార్లు దాడులు జరగడం, మూడు రోజుల వ్యవధిలో ఏడుగురు విద్యార్థినులు గాయపడినట్లు సమాచారం వెలువడటం కలకలం రేపుతోంది. ఘటనల తీవ్రతపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఒకే భవనంలో కళాశాల.. వసతి గృహం**

సారపాకలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల, వసతి గృహం ఒకే భవనంలో కొనసాగుతున్నాయి. ఫస్టియర్, సెకండియర్ విద్యార్థినులు కలిపి సుమారు 160 నుంచి 200 మంది ఇక్కడ విద్యనభ్యసిస్తూ వసతి పొందుతున్నారు. రాత్రివేళ విద్యార్థినులు నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు గదుల్లోకి ప్రవేశించి దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

**3న ముగ్గురు.. 9న మరో నలుగురు**

ఈ నెల 3వ తేదీన ముగ్గురు విద్యార్థినులపై ఎలుకలు దాడి చేసి గాయపరిచినట్లు సమాచారం. ఆ ఘటన మరువకముందే 9వ తేదీ రాత్రి మరో నలుగురు విద్యార్థినుల కాళ్లపై ఎలుకలు దాడి చేసినట్లు తెలిసింది. వరుస ఘటనలతో వసతి గృహంలో ఉంటున్న విద్యార్థినుల్లో భయాందోళన నెలకొన్నట్లు సమాచారం. 9వ తేదీన గాయపడిన విద్యార్థినులను వసతి గృహ సిబ్బంది భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు, చికిత్స చేయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. అనంతరం విద్యార్థినులను తిరిగి వసతి గృహానికి తీసుకొచ్చినట్లు చెప్పారు.

**డ్రైనేజీ నుంచే ఎలుకలు వస్తున్నాయా?**

వసతి గృహంలో ఎలుకల బెడదకు డ్రైనేజీ వ్యవస్థ కారణమై ఉండవచ్చని కళాశాల యాజమాన్యం గుర్తించినట్లు తెలుస్తోంది. ఎలుకలు డ్రైనేజీ నుంచి వస్తున్న విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లామని, ఎలుకలు ప్రవేశించకుండా డ్రైనేజీని మూసివేసినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి వివరించారు. అయితే కేవలం డ్రైనేజీ మూసివేతతో సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందా? వసతి గృహంలోని ఇతర ప్రాంతాల్లో ఎలుకల ఉనికిని గుర్తించి శాశ్వత నివారణ చర్యలు చేపట్టారా? విద్యార్థినుల గదులు, వంటగది, భోజనశాల, పరిసరాలను పూర్తిస్థాయిలో పరిశుభ్రం చేశారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఉన్నతాధికారులకు సమాచారం లేదా?**

వరుసగా విద్యార్థినులు ఎలుకల దాడికి గురవుతున్నప్పటికీ ఘటనలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై ప్రిన్సిపాల్ జ్యోతిని వివరణ కోరగా విద్యార్థినులకు ఆస్పత్రిలో చికిత్స చేయించినట్లు తెలిపారు.



అయితే ఘటనను ఉన్నతాధికారులకు తెలియజేశారా అని ప్రశ్నించగా 'చిన్న విషయమే కదా' అని సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నట్లు సమాచారం. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన ఘటనను ఉన్నతాధికారులకు తెలియజేయకపోవడంపై తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వసతి గృహంలో ఒకసారి ఎలుకల దాడి జరిగినప్పుడు వెంటనే నివారణ చర్యలు చేపట్టి ఉంటే రెండోసారి ఘటనలు జరిగేవి కావని వారు అభిప్రాయపడుతున్నారు.

**తల్లిదండ్రుల్లో ఆందోళన**

తమ పిల్లలను ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంచి చదివిస్తున్న తల్లిదండ్రులు వారి భద్రతపై నమ్మకం పెట్టుకుంటారు. అయితే విద్యార్థినులు నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు దాడి చేయడం, ఒకే నెలలో పలువురు గాయపడినట్లు సమాచారం రావడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నారులు, యువతులు ఉండే వసతి గృహాల్లో పారిశుధ్యం, ఆహార భద్రత, భవన భద్రత, క్రిమికీటకాల నియంత్రణ వంటి అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

**శాశ్వత పరిష్కారం ఏదీ?**

డ్రైనేజీ మూసివేతతో పాటు వసతి గృహం మొత్తాన్ని పరిశీలించి ఎలుకల ఉనికిని పూర్తిగా నిర్మూలించేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గదులు, మంచాలు, స్టోర్ రూములు, వంటగది, ఆహార నిల్వ ప్రాంతాలు, డ్రైనేజీలు, చెత్త నిల్వ ప్రాంతాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వరుస ఘటనల నేపథ్యంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే వసతి గృహాన్ని తనిఖీ చేసి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి, వసతి గృహ పారిశుధ్యం, ఎలుకల నియంత్రణకు తీసుకున్న చర్యలు, ఘటనలను అధికారులకు తెలియజేసిన విధానం తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థినుల భద్రత విషయంలో 'చిన్న ఘటన'గా తీసుకోకుండా ప్రతి ఫిర్యాదును తీవ్రంగా పరిగణించి, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు, విద్యార్థినుల తరపున పలువురు కోరుతున్నారు

# ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

**విద్యార్థులను చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంది.. ఏసిపి కెవిపి రాజు**




అరుణప్రభ ఇబ్రహీంపట్నం ఇబ్రహీంపట్నం గురుకుల విద్యపీట్ లో ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు అందించారు... ఈ కార్యక్రమంలో ఏసిపి రాజు పాల్గొని అవార్డులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ బాల్యాన్ని గుర్తు చేస్తూ విద్యార్థులు సక్రమంగా ఎదిగే క్రమంలో ఉపాధ్యాయుల ప్రోత్సాహం తప్పనిసరిగా ఉంటుందని నేను కూడా మా ఉపాధ్యాయుల ప్రేరణతోనే ఈ స్థాయిలో ఉన్నాను అని సందర్భంగా తెలిపారు.. విద్యార్థులు చెడు మార్గంలో మాదకద్రవ్యాలు ఆన్లైన్ బెట్టింగ్ లాంటి అలవాట్లకు లోను కాకుండా అలాంటి వారి పైన దృష్టి సారించాలి అని ఉపాధ్యాయుల సూచించారు మారుతున్న కాలం తగ్గినట్టుగా విద్యార్థులకు బోధన ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు. ఎంఈఓ హీర్య నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలతో క్రీడలతో సమయం కేటాయించినట్టు ఉపాధ్యాయులు చూడాలి ఖాళీ సమయం దొరికితే చెడు వ్యసనాల అలవాటు పడతారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, మంచాల సీఐ మధు ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు బెల్లి వెంకటేశం జనరల్ సెక్రెటరీ కే శివకుమార్ ట్రెజరర్ యస్ రుద్రాణి, డి.శ్రీనివాసరావు, నీలం బాను బాబు, బ్రిడ్జ్ కిషోర్ సింగ్, నాయిని సత్యనారాయణ, ఎండి గౌస్ పాషా, వివేక్, వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మండపాల దగ్గర భగవద్గీత, భక్తి పాటలు, భజన కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యాలి.

**ప్రతి మండపం దగ్గర గోమాత పూజ నిర్వహించాలి. ముత్తవరపు రాజశేఖర్**



అరుణ ప్రభ:- బూర్గంపాడు మండలం సారపాక లోని ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద పరుశురాం పరివార్ హిందూ సంస్థ వారి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పరశురాం పరివార్ హిందూ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్ మాట్లాడుతూ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. వినాయక మండపాలు పెట్టి వినాయక చవితి జరుపుతున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ వారికి కొన్ని సూచనలు చేశారు. వినాయకుని మండపం దగ్గర భగవద్గీత, భక్తి పాటలు, భజన కార్యక్రమాలు చేపట్టాలని మండప ఆవరణలో భరతనాట్యం, కూచిపూడి లాంటి నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని, నవరాత్రుల సమయంలో ప్రతి మండపం దగ్గర గోమాతకు పూజ నిర్వహించి, తద్వారా గో ప్రాముఖ్యతను, హిందూ ధర్మం గురించి తెలియజేయాలని, మట్టి ప్రతిమలను పెట్టడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, అన్నప్రసాద కార్యక్రమమును కూడా మండపంలో వినాయకుడు ఉన్న సమయంలోనే నిర్వహించగలరని, మీలాంటి వారు రాబోయే ముందు తరాలకు ఆదర్శంగా నిలవాలని, మా పరశురాం పరివార్ తరపున కోరుతున్నాము అని, గతంలో మేము మా సంస్థ తరపున ఎన్నో కార్యక్రమాలు చేశాము అని, మును ముందు కూడా ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేస్తామని, హిందూ ధర్మాన్ని కాపాడడంలో పరశురాం పరివార్ హిందూ సంస్థ ఎప్పుడు ముందుంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సభ్యులు ఇందుప్రియ, లక్ష్మి, సౌందర్య, శిరీష, కరిష్మా, వరలక్ష్మి, మాధవి, స్పందన, తనూజ, వినీల, భూలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హత లేకుండా వైద్యం చేస్తున్న ఆర్ఎంపీపై కేసు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ. న్యూస్, సెప్టెంబర్ 12: గొల్లపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ శ్రీనివాస్ గౌడ్‌పై ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎలాంటి వైద్య అర్హతలు, ధ్రువపత్రాలు లేకుండానే మందులు, ఇంజెక్షన్లు, రక్త పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారంటూ గొల్లపల్లి గ్రామానికి చెందిన చాతని రామ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు. ఫిర్యాదు ప్రకారం.. గత నెలలో గొల్లపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ అరుణ (35)కు ఛాతిలో నొప్పి రావడంతో ఆర్ఎంపీ శ్రీనివాస్ గౌడ్ వద్దకు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఆమెకు మందులు, ఇంజెక్షన్లు ఇచ్చినప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో సిరిసిల్లలోని ఆసుపత్రికి, అనంతరం కరీంనగర్‌లోని మురుగన్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్హత లేకుండా వైద్యం చేస్తూ, తనకు కమిషన్ ఇచ్చే ఆసుపత్రులకు రోగులను తీసుకెళ్లడం ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని ఫిర్యాదుదారు ఆరోపించారు. తన కుమార్తె ఆరోగ్య పరిస్థితిపై సరైన సమాచారం ఇవ్వకుండా చికిత్స అందించడం వల్లే ఆమె మృతికి ఆర్ఎంపీ శ్రీనివాస్ కారణమయ్యారని ఆరోపిస్తూ చాతని రామ్‌రెడ్డి పోలీసులకు దరఖాస్తు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హత లేని వ్యక్తుల వద్ద వైద్యం చేయించుకోవద్దు. వైద్య అర్హతలు, ధ్రువపత్రాలు లేని వ్యక్తుల వద్ద వైద్యం చేయించుకోవద్దని ఎస్సై ఎన్. రమేష్ ప్రజలకు సూచించారు. అర్హత లేని వ్యక్తుల వద్ద మందులు, ఇంజెక్షన్లు, రక్త పరీక్షలు చేయించుకోవడం వల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. అనుమానాస్పదంగా వైద్యం చేస్తున్న వ్యక్తుల వివరాలను సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు లేదా పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అర్హత కలిగిన వైద్యులను మాత్రమే సంప్రదించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్సై రమేష్ సూచించారు.

# ప్రపంచానికి దిక్సూచి బ్రిక్స్ దేశాలు

### మన శక్తియుక్తులకు నిదర్శనం న్యూఢిల్లి బ్రిక్స్ సమావేశాలు

### శంతన్ రామరాజు, కార్యదర్శి,

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి.



అరుణప్రభ 12 సెప్టెంబర్ మహబూబాబాద్ ప్రపంచానికి దిక్సూచి బ్రిక్స్ దేశాల సమాహారం అని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ బ్రిక్స్ సమావేశాల నిర్వహణ మన దేశ శక్తియుక్తులకు నిదర్శనన్నాడు. అంతర్జాతీయంగా మారుతున్న రాజకీయ, మిలిటరీ, ఆధిపత్య తదితర అంశాలను ప్రభావితం చేసే సామర్థ్యం బ్రిక్స్ దేశాలకు ఉందని పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచ జనాభాలో, ఆర్థికాభివృద్ధిలో ఎక్కువ వాటా కలిగి జీ7 దేశాల కూటమిని వెనక్కి నెట్టిన ఘనత బ్రిక్స్ దేశాలదన్నారు. తద్వారా అమెరికా, ఐరోపా దేశాల పెత్తనానికి గండి పడినట్లే అని అన్నాడు. డాలర్ అధిపత్యాన్ని సవాల్ చేస్తూ స్వంత కరెన్సిలోనే వ్యాపారం చెయ్యాలనే బ్రిక్స్ ఆలోచన ప్రపంచ ఆర్థిక రంగానికి నూతన జవసత్వాలు సమాకరినట్లే అని వ్యాఖ్యానించారు. అన్నింటికంటే ముఖ్యంగా బ్రిక్స్ దేశాల్లో ఐక్యతను పెంచుతూ మన దేశం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇంతటి మెగా ఈవెంట్ ను నిర్వహించడం ద్వారా ప్రపంచానికి మన దేశం ఒక సందేశం, భరోసా ఇచ్చినట్లే అని అన్నాడు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో న్యూడిల్లి బ్రిక్స్ సమ్మిట్ మన మిత్ర దేశాలకు అభయహస్తం, శత్రు దేశాలకు అక్రందనలు మిగిలాయని ఎద్దేవా చేశారు. ఒకవైపు అమెరికాతో స్నేహం చేస్తూ, ఐరోపా దేశాలతో వ్యాపారం చేస్తూ ఈ రెండింటికి బద్ధ శత్రువులైన రష్యా, చైనా, ఇరాన్ దేశ నేతలకు న్యూఢిల్లీ బ్రిక్స్ సమావేశాల్లో ఆతిద్యం ఇవ్వడం మోడీ చాణక్య నీతిని దేశ శక్తియుక్తులను ప్రపంచానికి చాటి చెప్పాయాన్నాడు. ప్రస్తుత బ్రిక్స్ సమావేశాల్లో భారత్ ప్రవేశపెట్టిన ఏకాభిప్రాయ సాధనకు సభ్యదేశాలు ఆమోదం తెలపడం శుభపరిణామమన్నారు. గల్వాన్ ఘటన తర్వాత చైనా అధ్యక్షులు జింపింగ్ మనదేశానికి రావడం బ్రిక్స్ ప్రాముఖ్యతను తెలియజేస్తోందన్నాడు. ఏదేమైనా న్యూడిల్లి బ్రిక్స్ మెగా సమావేశాలు మన దేశ ఖ్యాతికి ఇనుమడింప జేశాయని హర్షం వ్యక్తంచేశారు. భవిష్యత్ ప్రపంచానికి బ్రిక్స్ ఆశాకిరణమని అన్నాడు.



## పర్యావరణ హితం మట్టి విగ్రహాలు. మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ కిరణ్

### ఆర్ ఆర్ పాన్ షాప్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణి

పాలకుర్తి సెప్టెంబర్ 12 పాలకుర్తి మండల కేంద్రంలోని ఆర్ఆర్ పాన్ షాప్ యాజమాన్యం మట్టి వినాయక విగ్రహాల పంపిణి కార్యమాన్ని కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రకృతి నీ పరిరక్షించాలంటే రసాయన పదార్థాలతో చేసే విగ్రహాలు ప్రకృతిని నాశనం చేస్తున్నాయని, మట్టి విగ్రహాల పంపిణి కార్యక్రమం సమాజ హితం కోసం చేసే గొప్ప కార్యక్రమం అని కిరణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆర్ ఆర్ యాజమాన్యన్ని ఉపసర్పంచ్ అభినందించారు. ఈ కార్యక్రమం లో ఆర్ ఆర్ యజమాని నంద్యాల ఉమాకర్. నంద్యాల రాజేష్. నంద్యాల రాకేష్. వార్డు మెంబెర్ కమ్మగాని సుధాకర్. దొంగరి మహేందర్. కశిరబోయిన రాజు. దేవరాజు. రాపోలు రాంబాబు, గుమ్మడి రాజుల సాంబయ్య,గూడూరు లెనిన్. అబ్బోజు యాకస్వామి, మార్గం సందీప్,చరగొండ్ల రవి. గాదెపాక రమేష్.మారం రవి. గంగు నవీన్ శర్మ. దేవగిరి రమేష్. మట్టాగజం నాగరాజు.తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

### మంత్రి సీతక్కకు సన్మానం బిల్లుకు మద్దతుగా

### నిలిచిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు అభినందనలు: కోటేశ్వర్ గౌడ్



అరుణ ప్రభ రాజేంద్రనగర్, సెప్టెంబర్ 12, గ్రామపంచాయతీ 2018 చట్టం సవరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించినందుకు పంచాయతీరాజ్ మంత్రి సీతక్కను ప్రజాభవన్‌లో శంషాబాద్ మండల సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించినట్లు శంషాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్ తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ 2018 చట్ట సవరణ బిల్లుకు అనుకూలంగా మద్దతు తెలిపిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు ఆయన తెలిపారు. గ్రామపంచాయతీల అభివృద్ధి, సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఈ చట్ట సవరణ దోహదపడుతుందని కోటేశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, శంషాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్, సర్పంచులు ప్రభాకర్ గౌడ్, రవి నాయక్, రవీందర్ నాయక్, మౌనిక ఆంజనేయులు, బుజ్జి గోపాల్ నాయక్, బీక్య నాయక్, ఇందిరమ్మ, బిక్షపతి, దేవేందర్, మైలారం సురేఖ రాజు, బాలు ముదిరాజ్, బన్నీ, బిట్టు తదితరులు పాల్గొన్నారు.




## అంగట్లో ఐఫోన్ మాయం.. రద్దీ ప్రాంతాలే దొంగల టార్గెట్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 12 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన వార సంతలో ఐఫోన్ మాయమైన ఘటన కలకలం రేపింది. సంతకు వచ్చిన ఓ వ్యక్తి రద్దీగా ఉన్న ప్రాంతంలో తన ఐఫోన్ కనిపించకుండా పోయిందని తెలిపాడు. వార సంతలు, మార్కెట్లు, జాతరలు, బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాలను దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జనసందోహాన్ని అదునుగా చేసుకుని మొబైల్ ఫోన్లు, పర్సులు, నగదు తదితర విలువైన వస్తువులను అపహరిస్తున్న ఘటనలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంతలు, మార్కెట్లకు వచ్చే ప్రజలు తమ మొబైల్ ఫోన్లు, నగదు, ఇతర విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, దొంగతనం జరిగినట్లు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు తమ వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవడం ద్వారా ఇలాంటి ఘటనలను నివారించవచ్చని పలువురు పేర్కొన్నారు.



## మధుయాష్కి గౌడ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన మల్‌రెడ్డి రాంరెడ్డి

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియమితులైన మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ మధుయాష్కి గౌడ్ గారిని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ శ్రీ మల్‌రెడ్డి రాంరెడ్డి గారు ఈరోజు బంజారాహిల్స్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎద్దుల బండి ప్రతిమను అందజేసి మధుయాష్కి గౌడ్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతలో మరింత విజయవంతంగా రాణిస్తూ, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం ూవీజ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, +ఎవీజ మాజీ కోఆప్షన్ సభ్యురాలు శాలిని, మైనార్టీ సీనియర్ నాయకులు ఎండి జానీమియా, జగన్మోహన్ రెడ్డి, దుర్గా రెడ్డి, శ్రీధర్ గౌడ్, రాజశేఖర్, క్రాంతి, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

### డిప్యూటీ డీఎంహెచ్‌వో భాగ్యలక్ష్మి

ధర్మవరం, సెప్టెంబరు 12; (అరుణ ప్రభ న్యూస్) శివానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కేశవనగర్‌లో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో భాగ్యలక్ష్మి తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 25 నుంచి 46 సంవత్సరాల మధ్య ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. సర్వీస్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన వారు సెప్టెంబరు 19లోగా శివానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గౌతమికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

## హైదరాబాద్‌కు శాపంగా గత ప్రభుత్వ పదేళ్ల పాలన...

**డల్లాస్, లండన్ అంటూ అరచేతిలో వైకుంఠం చూపించారు..**

**రాష్ట్రంలోని సగం జనాభా హైదరాబాద్, రంగారెడ్డిలోనే ఉంది...**

**చరిత్రలో నిలిచిపోయేలా సీఎం రేవంత్ తెచ్చిన "క్యూర్-2026" బిల్లు..**

**బిల్లులోని అంశాలన్నీ పకడ్బందీగా అమలయ్యేలా చూడాలి...**

**సమన్వయ కమిటీ నెలరోజులకోసారి పర్యవేక్షించాల్సిన అవసరముంది...**

**ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి గారు...**

**క్యూర్ బిల్లుపై శాసనసభావేదికగా చర్చలో మాట్లాడిన ఎమ్మెల్యే....**



బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్‌ను లండన్ , డల్లాస్ చేస్తామని అరచేతిలో వైకుంఠం చూపించారని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి గారు ఆరోపించారు. హైదరాబాద్ నగరం కోసం డెబ్బైఏళ్లలో ఎవరూ ఆలోచించని రీతిలో... ఎంతో దూరదృష్టితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు క్యూర్ బిల్లు తెచ్చారని ఆయన చెప్పారు. కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లుపై శాసనసభలో జరిగిన చర్చలో భాగంగా మల్‌రెడ్డి రంగారెడ్డి గారు మాట్లాడారు. డెబ్భై ఏళ్ల క్రితం హైదరాబాద్ నగరం కోసం చట్టం చేసిన నాటికి, ఇప్పటికీ పదిరెట్ల జనాభా పెరిగిందని.... తెలంగాణ జనాభాలో సగం మంది హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే నివాసం ఉంటున్నారని ఆయన చెప్పారు. మారిన పరిస్థితులకనుగుణంగా ప్రజలకు సమగ్ర పరిపాలన అందించే లక్ష్యంతో సీఎం రేవంత్ గారు తెచ్చిన ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేస్తే... నగర చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. నగరం నలువైపులా విస్తరిస్తున్న తరుణంలో జీహెచ్ ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేయటం గొప్పనిర్ణయంగా మల్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ నాయకులు మాటలు చెప్పటానికే సరిపోయిం దని... వారిలాగా కాకుండా తీసుకున్న ప్రతీ నిర్ణయాన్ని పకడ్బందీగా అమలుచేయాల్సిన అవ సరముందన్నారు. ?జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైడ్రాలు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉండదన్న మల్‌రెడ్డి... బిల్లులో పేర్కొన్నట్టుగా మూడ్నెళ్ల కోసారి కాకుండా ప్రతీనెలా సమన్వయకమిటీ పర్యవేక్షిస్తే ఉత్తమమని సూచించారు. నిర్దేశించుకున్న సమన్వయంలోగా పనులు పూర్తయ్యేలా అధికారయంత్రాంగాన్ని నడిపించాలని చెప్పారు. ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు ఈ బిల్లులోని అంశాన్నీ పూర్తిస్థాయిలో అమలైతే నగరవాసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉంటారని చెప్పారు.

## ఏ ఐ వైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా యనమల్ల నవీన్

.అరుణ ప్రభ, దిండి, సెప్టెంబర్ 11,అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు యాదగిరిగుట్టలో జరిగిన ప్రతినిధుల మహాసభలో అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా దిండి మండలానికి చెందిన యనమల్ల నవీను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది .ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘం బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన అన్నారు ఈ సందర్భంగా మా ఎన్నికలతో సహకరించిన అందరికీ, రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తిమ్మాపూర్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 12 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామంలో నలుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ ఉప సర్పంచ్ జజ్జరి దేవేందర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలుస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేస్తున్నారని అన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారుల్లో జిల్లాల ఉమాకు రూ. 27,500, పల్లపాటి రవీందర్‌కు రూ. 21,500, బొంబోతుల కమలకు రూ. 24,000, చాట్ల నవ్యకు రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 93,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దండు శ్రీనివాస్, మండల సెక్రటరీ నామిలకొండ సత్యనారాయణ, నామిలకొండ దేవయ్య, కొలకాని శేఖర్, బంబోతుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు



## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

ధర్మవరం, సెప్టెంబరు 12; (అరుణ ప్రభ న్యూస్) గణేష్ ఉత్సవాలను ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, సోదరభావంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ధర్మవరం 2టౌన్ సీఐ జయ నాయక్ సూచించారు. విగ్రహ ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలు, ఊరేగింపు, నిమజ్జనం సందర్భంగా పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఊరేగింపుల్లో అధిక శబ్దంతో డీజేలు, సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదని, ఇతర మతాల ప్రార్థనా స్థలాలు, ఇళ్లు, దుకాణాలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం, గొడవలకు దిగడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం, వివాదాలకు దారితీసే వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. వినాయక కమిటీ నిర్వాహకులు యువత, సభ్యులను సమన్వయం చేసుకుంటూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా బాధ్యతగా వ్యవహరించాలని సీఐ జయ నాయక్ సూచించారు. నిమజ్జనం సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఏదైనా సమస్య, వివాదం లేదా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే స్వయంగా గొడవకు దిగకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ధర్మవరం 2టౌన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని సీఐ జయ నాయక్ విజ్ఞప్తి చేశారు.



## నల్లగొండలో బ్యాంకు ఉద్యోగుల భారీ ర్యాలీ నిరసన ప్రదర్శన

అరుణ ప్రభ, నల్లగొండ, సెప్టెంబర్ 11,యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యు ఎఫ్ బి యు)పిలుపుమేరకు బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నల్లగొండ పట్టణంలో భారీ ర్యాలీ, నిరసన ప్రదర్శన నిర్వహించారు.జిల్లాలోని వివిధ బ్యాంకులకు చెందిన సుమారు 600 మంది ఉద్యోగులు క్లాక్ టవర్ వద్ద గల ఎస్బిఐ నుంచి ర్యాలీగా బయలుదేరి పట్టణ ప్రధాన వీధుల గుండా నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని, పి ఎల్ ఐ చెల్లింపులో వివక్షను రద్దు చేసి సమాన విధానాన్ని అమలు చేయాలని, 12వ ద్వైపాక్షిక వేతన ఒప్పందంలోని అపరిష్కృత అంశాలు, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, బ్యాంకు పెన్షన్లకు పెన్షన్ అప్డేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు.బ్యాంకు ఉద్యోగుల దీర్ఘకాలిక లేవనెత్తుతున్న ఈ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ,లేని పక్షంలో యు ఎఫ్ బి యు పిలుపుమేరకు ఉద్యమాన్ని మరింత ఉద్యమం చేస్తామని నాయకులు హెచ్చరించారు.సెప్టెంబర్ 28,29,30 తేదీల్లో మూడు రోజుల సమ్మె చేపడతామని, అప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టి శ్రామిక్, ఎస్ కే రియాజ్ భాషా టీ సుమన్ కుమార్ ,ఎన్విటి, ఎం ప్రవీణ్ కుమార్, జీవన్ కుమార్, నరసింహ, కేశ్వర్ ,రాజశేఖర్, రాజు తో పాటు ఇతర నాయకులు పాల్గొని ప్రసంగించారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
ఆదివారం, సెప్టెంబరు 13, 2026

# విద్యా కేంద్రీకరణ విధానాలను విడనాడాలి

## టి ఎస్ ఈ సి రాష్ట్ర నాయకులు మైస. శ్రీనివాసులు



అరుణప్రభ 12 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణలో విద్యారంగ సంక్షోభం, సవాళ్లు-కర్తవ్యాలు అనే అంశంపై జిల్లా అధ్యక్షులు బలాస్టి రమేష్ అధ్యక్షతన టి పి టి ఎఫ్ జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగినది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు మైస శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజలు అడగని కొత్త విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తూ విద్యను కేంద్రీకృతం చేయడం సరైన విధానం కాదని ఇది ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమన్నారు. కావున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యా కేంద్రీకృత విధానాలను విడనాడి ప్రతి గ్రామంలో ఒక పాఠశాల ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు .ప్రస్తుతమున్న పాఠశాలల్లో కనీస వసతులు తీర్చలేని ప్రభుత్వం రకరకాల పేర్లతో భిన్నమైన పాఠశాలలను తీసుకురావడం కామన్ స్కూల్ విధానానికి వ్యతిరేకం అన్నారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుపరచడానికి ప్రతి తరగతికి ఒక తరగతి గది ఒక ఉపాధ్యాయుని నియమించేలా చర్యలు గైకొన్నప్పుడే విద్యాసాధికారత సాధ్యమవుతుందని లేనిపక్షంలో ఎన్ని భిన్న రకాల పాఠశాలలు తీసుకువచ్చిన ఫలితం లేదని అది ఎండమావిని చూసి నీరని భ్రమ పడడమేనని అన్నారు. రాష్ట్రం లో ప్రభుత్వ విద్యను కాపాడుకోవడాని ప్రజా ఉద్యమం అవసరమని, ప్రతి రాజకీయపార్టీ విద్యా పరిరక్షణ ఉద్యమాలలో పాల్గొనాలని, ప్రభుత్వ విద్య అభివృద్ధి కావాలంటే విద్య ప్రైవేటీకరణను అడ్డుకోవాలని తెలిపారు. అంతరాలు లేని విద్య పోవాలంటే సమాన అవకాశాలు ఉండే కామన్ స్కూల్ విధానమే పరిష్కారమని ఇది విద్య ఉద్యమము ద్వారానే సాధ్యమని అన్నారు . తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లుట్ల భాస్కర్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు కొత్తపల్లి రవి డి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రాజు రిటైర్డ్ గెజిటెడ్ హెడ్మాస్టర్ బందెల రాజు పిడిఎస్యు నాయకులు బోనగిరి మధు చైతన్య మహేష్ ఎస్కే షబ్బీ టి పి టి ఎఫ్ మొబైల్ మండల ప్రధాన కార్యదర్శి సి రెడ్డి రామలింగారెడ్డి టి పి టి ఎఫ్ నాయకులు ప్రకాష్ ఈసల లక్ష్మయ్య భీముడు పాల్గొన్నారు



## ప్రముఖ సిద్ధాంత వేత్త కామ్రేడ్ సీతారామ్ ఏచూరి

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): కామ్రేడ్ సీతారాం ఏచూరి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ సిద్ధాంత వేత్త,కమ్యూనిస్టు దిగ్గజం, భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మాజీ అఖిలభారత కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి కార్యక్రమం శనివారం రోజు గూడూరు లోని సి.పి.ఎం పార్టీ కార్యాలయంలో శాఖ కార్యదర్శి జోగి.శివకుమార్ అధ్యక్షతన జరిగింది. నాయకులు కామ్రేడ్ సీతారాశీ ఏచూరి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించడం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రజల కోసం.. ప్రజలతో పాటు..జీవిత మంతా పోరాటమే లక్ష్యంగా, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో వ్యక్తిగత సంబంధాలు కొనసాగిస్తూ, రాజకీయ విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించడానికి ప్రయత్నించే నాయకుడిగా ఆయనకు గుర్తింపు వచ్చిందని, సీతారాశీ ఏచూరి కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని మార్క్సిజం,సామాజిక వాదం, మతతత్వం,భారత రాజకీయాలపై రచనలు చేయడం జరిగిందని, సీతారాశీ ఏచూరి 1952 ఆగస్టు 12వ తేదీ మద్రాస్ లో జన్మించారని, 2024 ఆగస్టులో ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్ లో చేరడం జరిగిందని, శ్వాస కోస సంబంధిత తీవ్రమైన అనారోగ్యంతో చికిత్స పొందుతూ 2024 సెప్టెంబర్ 12వ తేదీన మరణించడం జరిగిందని,ఆయన వయస్సు 72 సంవత్సరాలు ఆయన కుటుంబ సభ్యుల నిర్ణయంతో ఆయన భౌతిక కాయాన్ని ఎయిమ్స్ కు వైద్య,విద్య, పరిశోధన కోసం దానం చేయడం జరిగిందని తెలియజేశారు. నాయకులు టి.వెంకట రామిరెడ్డి, పుట్టా శంకరయ్య,పామంజి మణి,బి.వి.రమణయ్య, అడపాల ప్రసాద్,ఎంబేటి చంద్రయ్య, ఎస్.డి.రఫీ, గండికోట మధు, ధారా కోటేశ్వరరావు బి చంద్రయ్య పాల్గొన్నారు.

## ఎన్ ఎస్ యు ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా భల్లెం చంటి నియామకం.



అరుణప్రభ 12 సెప్టెంబర్ మహబూబాబాద్ నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా భల్లెం చంటి నియమితులయ్యారు. ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జాఖర్ జీ ఆదేశాల మేరకు, ఎన్ ఎస్ యు ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యాదవల్లి వెంకటస్వామి మార్గదర్శకత్వంలో భల్లెం చంటిని మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు ఈ నియామకానికి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ డోర్నకల్ ఎమ్మెల్యే శ్రీ జాటోత్ రామచంద్రు నాయక్ గారు, మహబూబాబాద్ డీసీసీ అధ్యక్షులు భూక్య ఉమా మురళీ నాయక్ ఎన్ ఎస్ యు ఐ మహబూబాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీ పెరుమాండ్ల చరణ్ గౌడ్ మొదలగు నేతల సహకారం, మద్దతు, మార్గదర్శకత్వం ఎంతో కీలకమని ఎన్ ఎస్ యు ఐ నాయకులు తెలిపారు జిల్లాలో విద్యార్థుల సమస్యలను బలంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, విద్యార్థులకు న్యాయం జరిగేలా నిరంతరం పోరాటం చేయడం, విద్యా రంగంలో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని భల్లెం చంటి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో ఎన్ ఎస్ యు ఐ ని మరింత బలోపేతం చేస్తూ, ప్రతి కళాశాలలో విద్యార్థుల గొంతుకగా నిలిచి, విద్యార్థి హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని ఆయన పేర్కొన్నారు ఈ సందర్భంగా భల్లెం చంటికి ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రతే కాళోజి వాకర్స్ లక్ష్యం



అరుణప్రభ 12 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం ఏడు గంటలకు నుండి సుమారు గంట సమయం పాటు స్టేడియంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో స్టేడియంలోపల నలువైపులా ఉన్నటువంటి విస్తరాకులు, వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ బాటిల్స్, ఐస్ క్రీమ్ కప్స్,వివిధ రకాల పేపర్ ప్లేట్స్, చాక్లెట్ పేపర్స్ మొదలగు వాటన్నింటినీ సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమం సందర్భంగా వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకటరెడ్డి మరియు ముఖ్య సలహాదారు మైస శ్రీనివాస్ మాట్లాడుతూ........ కాళోజి వాకర్స్ అసోసియేషన్ ప్రతి రెండవ శనివారము ఎన్టీఆర్ స్టేడియంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమము చేపడుతుంది. అందులో భాగంగా ఈరోజు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం వాకర్స్ మిత్రుల సహకారంతో చేపట్టడం జరిగినది. మా కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆరోగ్య రక్షణ ధ్యేయంగా కాకుండా పరిసరాల పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. అదేవిధంగా ఈరోజు వివిధ రకాల చెట్లకు మునిసిపల్ వాటర్ ట్యాంకర్ సహకారముతో నీరు పోయడం జరిగినది. స్టేడియంలో వివిధ రకాల వ్యక్తులు పంచాయతీల కోసము వచ్చే సందర్భంలో వాటర్ బాటిల్స్, విస్తరాకులు, కూల్ డ్రింక్స్ బాటిల్స్, మొదలగు వాటిని ఇష్టం వచ్చిన రీతిగా పారవేస్తున్నారు. పిల్లలు మరియు గేమ్స్ కోసం వచ్చే యువత ఐస్ క్రీమ్స్ లాంటివి తిని పారవేస్తున్నారు. వీరందరికీ మా సూచన ఏమంటే ఈ గ్రౌండ్ మన అందరిదీ, కావున దీనిని పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత కూడా మనదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ పెద్దలు వినోద్ కుమార్ గారు కూడా పాల్గొని, తమ వంతు సహకారాన్ని అందించారు. ఇంకనూ ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, పెద్ది వెంకన్న, శ్రీహరి, వెంకన్న, మహేందర్ రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బిక్షం, రాంబాబు,రాజన్న,దేవేందర్ రెడ్డి,రామకృష్ణ రావు, శ్రీనివాస్,ఎంఎస్ రెడ్డి, రవీందర్, లక్ష్మీనారాయణ, ఐలేష్, ఉపేందర్, మల్లయ్య, దామోదర్ రెడ్డి, బి. రాజు, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, దామోదర్, రామకృష్ణ,తోలం వెంకటేశ్వర్లు, పగడయ్య, నాగేశ్వరరావు, నాగరాజు, రాధాకృష్ణ, నేరెళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి



దేశ స్వాతంత్ర్యోద్యమంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో మరియు మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఏకైక జాతీయ విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఏఐఎస్ఎఫ్). ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ మహా సభలను సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో హన్మకొండ జిల్లా వేదికగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని పుట్ట లక్ష్మణ్ తెలియజేసారు. శనివారం నాడు ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఉప్పల్ డిపో కారాలయం ముందు వార్షికోత్సవాల “గోడ పత్రికను” విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. చదువు – పోరాటం: “చదువు! పోరాడు!!” అనే నినాదంతో విద్యార్థి లోకం పక్షాన నిలబడి పోరాడుతున్న ఏఐఎస్ఎఫ్ , 90 ఏళ్ల ఘనమైన చరిత్రను పూర్తి చేసుకుంటోంది. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హన్మకొండ వేదికగా జరిగే ఈ వార్షికోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, , మేధావులు మరియు పూర్వ ఏఐఎస్ఎఫ్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించారు. పేదవాడు చదువుకోవాలంటే లక్షల రూపాయలు వెచ్చించాల్సిన పరిస్థితి వచ్చింది. పాలకుల విధానాల వలన దేశవ్యాప్తంగ ఉన్న బడుగు , బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయకుండా, మోసపూరిత మాటలతో.. తమ పబ్బం గడుపుకొంటున్నాయి. విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ విద్యకు సరైన నిధులు కేటాయించకుండా, వసతులు కల్పించకుండా పేద, మధ్య తరగతి విద్యార్థుల పట్ల వారి భవిష్యత్తు పట్ల తమ వంతు సహకారాన్ని, ప్రోత్సహాన్ని అందించకుండా సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నాయి. కేంద్రంలో మోడి ప్రభుత్వం 10o2o3 కి బదులుగా 5o3o3o4 నూతన జాతీయ విద్యా విధానం తీసుకవచ్చి విద్యను ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి కుట్ర చేస్తున్నారు. విద్యార్థులకు స్ఫూర్తి అయిన పూలే, భగత్ సింగ్, అంబేద్కర్, పెరియార్, నారయణ గురు వంటి వారి జీవిత చరిత్రలను, డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగించి బ్రిటీష్ వారికి తొత్తుగా వ్యవహరించిని సావర్కర్ జీవిత చరిత్రలను చేర్చి, దేశ చరిత్రను వక్రీకరిస్తున్నారు. బాల్యం నుంచే విద్యార్థుల మెదుడుల్లోకి మతతత్వ భావజాలాన్నీ నింపుతున్నారు. విద్యార్థుల మధ్య మత విభజన చేయడానికి హిజాబ్ వంటి అంశాలతో రెచ్చగొడుతున్నారు. జోతిష్యం, వాస్తు కోర్సుల పేర్లతో విద్యార్థులలో మూఢ నమ్మకాలను పెంచి పోషిస్తున్నారు. విశ్వ విద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయడానికి కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పేరుతో పేద విదార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారు. మెడికల్ ఎంట్రన్స్ (నీట్) ను ప్రాంతీయ భాషలలో నిర్వహించక పోవడం వలన దక్షణాదిన ప్రతిభవున్న విద్యార్థులు సైతం నీట్ లో అర్హత సాధించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పరీక్ష పేపర్ల లీకుల వల్ల లక్షలాది మంది విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. విద్యారంగంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, భోదనేతర సిబ్బంది. లెక్చరర్ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు, సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌళిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గురుకులాల్లో, సాంఘీక సంక్షేమ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా, విద్యార్థి మరణాలు సంభవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలోలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయడం లేదు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ లక్షలాది రూపాయలు దోచుకుంటూ విద్యా దోపిడి చేస్తూ విద్యను వ్యాపారమయంగా మార్చారని ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టం అమలు కావడంలేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థల కబంధ హస్తాల్లో ఉంటూ వారు చేస్తున్న ఫీజుల దోపిడి పట్ల చూసి చూడనట్లు వ్యవహరిస్తుందని పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆసరగా ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటంఆడుతుందనితెలియజేసారు. ఈ వార్షికోత్సవాల్లో విద్యారంగంలో ఎదురవుతున్న సవాళ్లు, విద్యార్థుల సమస్యలు మరియు ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎండీ. అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, జిల్లా నాయకులు దుర్గాప్రసాద్ , శ్రీకాంత్ , గణేష్ , కృపాకర్ ,వెంకట్ , రాము తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

## ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శని వారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మధు బాబు మాట్లాడుతూ...చిన్న చిన్న తగాదాలతో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరగడం వల్ల సమయాన్ని, డబ్బుని వృధా చేసుకుంటున్నారని, లోక్ అదాలత్ ల ద్వారా పరిష్కరించుకున్నట్లయితే ఇరువర్గాల వారు విజయం సాధించి నట్లేనని, రాజీమార్గమే రాజీమార్గమని పేర్కొన్నారు.కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగుతుందని కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఏడవ అదనపు జిల్లా జడ్జి కె.వెంకట నాగ పవన్ కక్షిదారులతో మాట్లాడి పలు కేసులను పరిష్కరించారు.ఈ సమావేశంలో న్యాయవాదులు సాయికుమార్ రెడ్డి ,కోటేశ్వరరావు ,అరవ పార్వతయ్య ,మహబూబ్ భాష ,భాస్కర్ రెడ్డి ,కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## టీడీపీ హయంలోనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి

### గూడూరు ఎమ్మెల్యే పాశిం



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): టిడిపి ప్రభుత్వం లోనే గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో అనేక వసతులు కల్పించడం జరిగిందని నేడు అత్యాధునిక ల్యాబ్ ప్రారంభించడం సంతోషంగా ఉందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు . గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ఒక కోటి 25 లక్షల రూపాయల తో ఏర్పాటు చేసిన సమగ్ర ప్రజా ఆరోగ్య పరీక్ష కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ,ఆర్డిఓ అరుణకుమారి హాజరయ్యారు . ఎమ్మెల్యే ,ఆర్డీవో , కమిటీ సభ్యులు పరీక్షా కేంద్రాలను ప్రారంభించి నిర్వహించే పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు .అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందని ప్రభుత్వ హాస్పిటల్ లో సిటీ స్కాన్ డయాలసిస్ యూనిట్ గల్ల పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా 22 కేంద్రాల్లో అత్యాధునిక వసతులతో ల్యాబ్ లో ప్రారంభించడం జరిగిందని దానిలో గూడూరు కూడా ఉండడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ల్యాబ్ లో ఇప్పటివరకు లేనటువంటి థైరాయిడ్ ,క్యాన్సర్ ,ఇంకా అనేక పరీక్షలు చేస్తారని అసంపూర్తిగా నిలిచిపోయిన హాస్పిటల్ నూతన భవన నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్డీవో అరుణకుమారి మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో ప్రజలకు ప్రభుత్వం ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేసిందని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునరావు ,నాయకులు కిరణ్ కుమార్ ,బిల్లు చెంచురామయ్య ,మట్టం శ్రావణి ,భారతి ,సూపరిడెంట్ షరీనా, ఆర్ఎంఓ ప్రసన్న, పలువురు వైద్యులు సిబ్బంది ,పాల్గొన్నారు.



## మట్టి విగ్రహాలను వాడండి...

### పర్యావరణాన్ని కాపాడండి.. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున రావు

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు స్థానిక టవర్ సెంటర్ నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు వాడండి– పర్యావరణాన్ని కాపాడండి అనే గోడపత్రికలను విడుదల చేసి, పూల కుండీలో వినాయక ప్రతిమను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పురపాలక కమిషనర్ మల్లికార్జున రావు మాట్లాడుతూ జే.వి.వి ఆధ్వర్యంలో వినాయక చవితి నాడు మట్టి వినాయక విగ్రహాలను వాడండి మీ ఇంటి ఆవరణలో లేదా పూల కుండీలో విగ్రహాన్ని నిమజ్జనం చేయాలని వారు చేసి చూపించిన కార్యక్రమం చాలా వినూత్నంగా ఉందని ప్రతి ఒక్కరూ కూడా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడొద్దని వాటి ద్వారా నీరు కలుషితమై నీటిలో ఉండే జీవరాసులు, చేపలు చనిపోవడమే కాకుండా ఆ నీరు ప్రజలు కూడా తాగి అనారోగ్యం పాలు అవుతున్నారని అందువలన విజ్ఞులైన ప్రజలు కూడా ఆలోచించి మట్టి వినాయక విగ్రహాలను వాడాలని తద్వారా మన ఇంటి పెరటి ఆవరణంలో గానీ పూల కుండీలో గాని ఆ మట్టి వినాయక ప్రతిమను నిమజ్జనం చేసి పూల మొక్క నాటాలని తెలియజేసిన జె.వి.వి సభ్యులందరినీ అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.వి.వి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, జనసేన నాయకులు మునిగిరీష్, నాగరాజు, చెంచు నారాయణ, రజనీకాంత్, రామమోహన్, ప్రభాకర్,జగదీష్, సుమన్ రెడ్డి, అరుణ్ కుమార్, డివిడి కుమార్, శ్రీనివాసాచారి, సాయికిరణ్, పసల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## అపూర్వంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అరుణప్రభ 12 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ మహబూబాద్ జిల్లా కేంద్రంలో సుమారు అర్థ శతాబ్దం పాటు విద్యారంగంలో విశేష సేవలు అందించిన అరవింద విద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. 1995–1996 సంవత్సరం చెందిన విద్యార్థులు బస్టాండ్ రోడ్ లోని కిరాణా వర్తక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అరవింద విద్యాసంస్థ అధినేత ఎన్. చంద్ర దేవ్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు వివిధ హోదాల్లో, ఉన్నత స్థానాల్లో స్థిరపడడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన రిటైర్డ్ లెక్చరర్, ఎన్.ఎస్.ఎస్ అధికారి కూతురు సత్యనారాయణ మాట్లాడుతూ, సృష్టిలో స్నేహాన్ని మించింది మరేది లేదని, విద్యార్థులు సంఘటితంగా సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ తమ అనుభవాలను, ఆత్మీయ ఆత్మీయతను పంచుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఫీ, వెంకన్న, చరణ్, మహమ్మద్,గౌస్ , నాగేందర్, రవీందర్, వెంకటేశ్వర్లు, సద్గుణ చారి, పరశురాములతో పాటు కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థు లు టి. నవీన్, డి. నరేష్, ఎం. సతీష్, వి. వినోద , ఎల్. సంతు, జి. భాస్కర్, అనంతరం ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించారు

# గొల్లపల్లిలో మహిళా కండక్టర్‌పై దాడి

## బస్సు నిలిపివేత.. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 12 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో మహిళా ఆర్టీసీ కండక్టర్‌పై దాడి ఘటన కలకలం రేపింది. బస్సులో విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్‌తో ఓ వ్యక్తి వాగ్వాదానికి దిగిన అనంతరం ఆమెపై దాడికి పాల్పడినట్లు సమాచారం. ఘటనతో ఆగ్రహించిన ప్రయాణికులు, స్థానికులు గొల్లపల్లి ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో కొంతసేపు బస్సు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. మహిళా కండక్టర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దాడికి గల కారణాలతో పాటు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తూ విచారణ కొనసాగిస్తున్నారు. మహిళా ఉద్యోగిపై దాడి చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



## ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

### ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జె.వి. రమణ

ధర్మవరం, సెప్టెంబరు 12; (అరుణ ప్రభ న్యూస్) కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జె.వి. రమణ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఏచూరి రెండో వర్ధంతి కార్యక్రమంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, చేనేత కార్మికులు, సామాన్య ప్రజల సమస్యలపై ఏచూరి చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడమే నిజమైన నివాళి అన్నారు కార్యక్రమంలో ఎస్. హెచ్. భాష, జె.వి. రమణ, నామాల నాగార్జున, ఎల్. ఆదినారాయణ, అన్నం సూరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పినపాకకు రూ.186 కోట్ల అభివృద్ధి వరం

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషి ఫలితం..
### బీటీ రోడ్లు, వంతెనల అభివృద్ధికి హెచ్ ఏ ఎం నిధులు
### దసరాలోపే పనులకు శ్రీకారం..
### 15 ఏళ్ల నిర్వహణ బాధ్యత హెచ్ ఏ ఎం సంస్థలదే



అరుణ ప్రభ:- పినపాక నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీ నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని బీటీ రహదారులు, వంతెనలు, బ్రిడ్జిల అభివృద్ధి, నిర్మాణ పనుల కోసం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ ఏ ఎం) ద్వారా సుమారు రూ.186 కోట్ల నిధులు మం జూరయ్యాయి. ఈ నిధులతో నియోజకవర్గంలోని 7 మండలాల్లో అవసరమైన రహదా రులు, వంతెనల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. పనులను దసరా పండుగలోపే ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. హెచ్ ఏ ఎం విధానంలో చేపట్టే పనులకు సుమారు 15 సంవత్సరాల పాటు నిర్వహణ బాధ్యత సంబంధిత సంస్థలదే ఉండనుంది. దీంతో నిర్మాణాలతో పాటు రహదారులు, వంతెనల దీర్ఘకాలిక నిర్వహణకు అవకాశం కలగనుంది. నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు కావడం పట్ల ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పినపాక నియోజకవర్గంలో రహదారులు, వంతెనల అభివృద్ధికి రూ.186 కోట్ల నిధులు మంజూరు కావడం ప్రజలకు రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# మేడిపల్లి సిపిఆర్ఐ వద్ద ఉన్న గణేష్ దేవాలయ ఎదుట నిర్మిస్తున్న షెడ్ ని కూల్చివేసిన పోలీసు అధికారులు

## అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు బిజెపి నాయకుల ఆరోపణ



సెప్టెంబర్ 12, అరుణ ప్రభ.. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి డివిజన్ సీపీఆర్ఐ సమీపంలోని శ్రీ కార్యసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం వర్షాల నుంచి రక్షణ కల్పించే షెడ్డు నిర్మాణానికి ప్రయత్నిస్తుండగా పోలీస్ అధికారులు కూల్చివేతను అడ్డుకున్న బీజేపీ నాయకులు మరియు దేవాలయ కమిటీ సభ్యులు...పోలీసులు మరియు బిజెపి నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన సెజ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాని జేశ్వంత్ రెడ్డి కి వత్తాసు పలుకుతూ ఆలయానికి సంబంధించిన విషయంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర యువమోర్చా నాయకులు బండారు పవన్ రెడ్డి పిలుపునిస్తూ...ప్రతి హిందూ బంధువు శ్రీ కార్యసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్దకు చేరుకుని ఆలయ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఇది కేవలం ఒక ఆలయానికి సంబంధించిన విషయం కాదు.. మన ఆలయాల గౌరవం, భక్తుల హక్కులు, హిందూ సమాజం ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. అందరం శాంతియుతంగా, ఐక్యంగా నిలబడి మన ఆధ్యాత్మిక ప్రదేశాల పరిరక్షణకు అండగా నిలుద్దాం.

# పర్యావరణాన్ని పరిరక్షించడం సామాజిక బాధ్యత



## మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి

అరుణప్రభ 12 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని, ప్రకృతిని కాపాడుకోవాలనే ఉన్నత ఆశయంతో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరై, స్వయంగా కోర్టు సిబ్బందికి, ప్రజలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమవుతూ పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాల ప్రకారం మట్టి విగ్రహాలను మాత్రమే పూజించి, రాబోయే తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతి మురారి, సీనియర్ సివిల్ జడ్జి షాలిని షాకెల్లితో పాటు కోర్టు ముఖ్య పరిపాలన అధికారి శ్రీనివాస్, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలి

## పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో అభివృద్ధికి కృషి చేయాలి



ధర్మవరం, సెప్టెంబరు 12; (అరుణ ప్రభ న్యూస్) రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో టీడీపీ జెండా ఎగరాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ధర్మవరం పట్టణంలోని 10వ క్లస్టర్ సమావేశాన్ని ఎర్రగుంట సర్కిల్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. 15, 21, 22, 23, 26, 27, 29, 30, 31, 32 వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య మాట్లాడుతూ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసి మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు పరిసే సుధాకర్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. క్లస్టర్ కన్వీనర్ పురుషోత్తం గౌడ్, కో-కన్వీనర్ మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డులో ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీ అధిష్టానం నిర్ణయాలకు అనుగుణంగా పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో సమష్టిగా పనిచేయాలని కోరారు.

## స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి

### జలలికేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపులి



ధర్మవరం, సెప్టెంబరు 12; (అరుణ ప్రభ న్యూస్) త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ధర్మవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు నచ్చిన అభ్యర్థులను ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపిక చేసుకుని ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. ధర్మవరం పట్టణంలోని 48 వార్డులతో పాటు నియోజకవర్గంలోని 110 క్లస్టర్లలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి కుంటుపడ్డాయని కేతిరెడ్డి విమర్శించారు. ధర్మవరంలోని చేనేత కార్మికులకు 'నేతన్న నేస్తం' నిధులు పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. అర్హులకు నిధులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో సమృద్ధిగా వర్షాలు కురిసినా పీబీఆర్ కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. దీంతో నియోజకవర్గంలో భూగర్భ జలాలు పడిపోయాయని అన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొంటూ, స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## లోక్ అదాలత్‌లో 409 కేసుల పరిష్కారం"

### జడ్జీలు వెంకటేశ్వర్లు, వెంకట హరీష్



ధర్మవరం, సెప్టెంబరు 12; (అరుణ ప్రభ న్యూస్) ధర్మవరం కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 409 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట హరీష్ తెలిపారు. పరిష్కరించిన కేసులకు సంబంధించి మొత్తం రూ.27,74,004 మేర పరిష్కారం జరిగినట్లు పేర్కొన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని, ఇరుపక్షాల అంగీకారంతో రాజీ కుదిరిన కేసులను మాత్రమే లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన పోలీస్ శాఖ, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## మరణంలోనూ ఇద్దరికి చూపునిచ్చిన నరసింహులు



ధర్మవరం, సెప్టెంబరు 12; (అరుణ ప్రభ న్యూస్) పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన షాకే నరసింహులు (68) మృతి చెందగా, కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు. మానవతా సంస్థ చైర్మన్ తల్లం నారాయణమూర్తి కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్రదానానికి అంగీకరింపజేశారు. అనంతపురం రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఐ టెక్నీషియన్ రాఘవేంద్ర రెండు నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మానవతా సంస్థ ప్రతినిధులు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు మంజునాథ్, రవికుమార్, రిటైర్డ్ కంటి వైద్యులు సంకారపు నరసింహులు, ఆప్తాల్మిక్ అధికారి ఉరుకుందప్ప పాల్గొన్నారు.



## పూలే, అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి

### బహుజన ఉద్యోగుల న్యాయభేరి డిమాండ్

ధర్మవరం, సెప్టెంబరు 12; (అరుణ ప్రభ న్యూస్) ప్రతి జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని బహుజన ఉద్యోగుల న్యాయభేరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ధర్మవరంలోని ఎన్జీవో హోంలో రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగం, రిజర్వేషన్లను పరిరక్షించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కోరారు. చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం విగ్రహాలు ఏర్పాటు చేయకపోతే రిజర్వేషన్ వర్గాల ఐక్యతతో ముందుగా సత్యసాయి జిల్లా కేంద్రంలో పూలే, అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తామని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్. నారాయణ నాయక్, డాక్టర్ పోతుల నాగరాజు, జయశ్రీ, పలువురు నాయకులు పాల్గొన్నారు

# భూలక్ష్మినగర్‌లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం

ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించిన మల్‌రెడ్డి రాంరెడ్డి. వనస్థలిపురం:అరుణ ప్రభ సెప్టెంబర్ 12.భూలక్ష్మినగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, వయోవృద్ధుల సేవాసమితి సౌజన్యంతో స్థానిక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ శ్రీ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. లిఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజినల్ క్యాన్సర్ సెంటర్ (వీచీజీ ఝుఅఎవతీ ఎశీంజూఊఖశ్రీ)లికు చెందిన అనుభవజ్ఞులైన వైద్య బృందం శిబిరంలో పాల్గొని సీనియర్ సిటిజన్లు, కాలనీవాసులకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించింది. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, వృద్ధాప్యంలో ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం అందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సీనియర్ సిటిజన్ల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సేవా దృక్పథంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భూలక్ష్మినగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వయోవృద్ధుల సేవాసమితి నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ శిబిరానికి భూలక్ష్మినగర్‌తో పాటు కమలానగర్, ద్వారకామయి నగర్, శారదానగర్, సుభద్రానగర్, హైకోర్టు కాలనీ, రాజపునగర్ తదితర పరిసర ప్రాంతాల నుంచి



సీనియర్ సిటిజన్లు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహా రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు సామరెడ్డి భుజంగా రెడ్డి, పటోళ్ల మాధవ రెడ్డి, సోలిపురం వెంకట్రామ్ రెడ్డి, జానీ భాయ్, సామ రోహిత్ రెడ్డి,సంరెడ్డి భుజంగారెడ్డి,అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, వయోవృద్ధుల సేవాసమితి స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట మండలం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక.

## అధ్యక్షుడిగా బుగ్గ కృష్ణమూర్తి శర్మ.

## జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమానికి కృషి.

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 12 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట మండలం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల స్థాయిలో జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, పాత్రికేయుల వృత్తిపరమైన అభివృద్ధి, హక్కులు, సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేయాలనే లక్ష్యంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులుగా మోస్ట్ సీనియర్ జర్నలిస్టులు బండారి బాల్రెడ్డి, కాసు శ్రీనివాసరాజు లు,అధ్యక్షుడిగా బుగ్గ కృష్ణమూర్తి శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యక్షులుగా కులేరి కిషోర్ కుమార్, దుర్గం విజయ్ బాబు, పెంటం శ్రీనివాస్ లు,ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు బాలరాజు యాదవ్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా కులేరి దీప్తి కుమార్, ఒగ్గు మహేష్ చంద్ర, కోశాధికారిగా శ్రీ రామోజీ శేఖర్ నియమితులు అయ్యారు. సలహాదారులుగా చే ట్కూరి తిరుపతి, శ్రీ రామోజీ ప్రవీణ్, సురేష్ యాదవ్ లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సురేష్, చేపూరి నాగరాజు, చింతకింది శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే సంయుక్త కార్యదర్శులుగా యమగొండపద్మా రెడ్డి, ముద్రకోలా కృష్ణ, బెస్త నరేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

**జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి.**

నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. పాత్రికేయుల హక్కులు, సంక్షేమం కోసం ముందుండి పనిచేస్తామని పేర్కొన్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమర్ధవంతంగా వెలుగులోకి తీసుకువచ్చి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు పాత్ర పోషిస్తామని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక అంశాలు, ప్రజా సమస్యలకు సంబంధించిన



వార్తలను వాస్తవాలను ఆధారంగా చేసుకుని ప్రజలకు చేరవేయడమే తమ ప్రధాన లక్ష్యమని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ప్రజలకు--ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు.

**నూతన కార్యవర్గానికి ఘన సన్మానం.**

ఎల్లారెడ్డిపేట మండలానికి పూర్తిస్థాయి ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పడటంతో పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. రాచర్ల గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, కంచర్ల మాజీ సర్పంచ్ జొన్నల శ్రీనివాస్ గుప్తా, కాంగ్రెస్ నాయకుడు మర్రి శ్రీనివాస్ రెడ్డి నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందించారు. అదేవిధంగా ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన గణేష్ ఉత్సవ కమిటీ సమావేశానికి హాజరైన సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, ఎల్లారెడ్డిపేట సీఐ ఓ. వెంకటేష్, ఎస్ఐ ఎన్. రమేష్ గౌడ్ నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చురుకైన పాత్ర పోషించాలని పలువురు ఆకాంక్షించారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం.



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 12 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీరామకృష్ణ సినిమా టాకీస్ సమీపంలో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఏఎంసీ చైర్మన్ షేక్ సబేరా బేగం గౌస్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుత్ భారం తగ్గడంతో పాటు, శ్రీరామకృష్ణ సినిమా టాకీస్ వద్ద ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా పరిసర ప్రాంతంలోని గృహ వినియోగదారులకు తక్కువ వోల్టేజీ సమస్య పరిష్కారం కానుందని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎలగందుల నరసింహులు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఉప సర్పంచ్ బందారపు బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ యాదవ్, వార్డు సభ్యులు అంతేర్పుల గోపాల్, అంగూరి ప్రవీణ్, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, నాయకులు నేవూరి సర్వయ్య, గారి పద్మారెడ్డి, జగన్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, గుండాడి వెంకట్‌రెడ్డి, గంట బుచ్చా గౌడ్, రాపెల్లి అంబదాస్, రఫీక్, దొనుకుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏర్పాట్లను పరిశీలించిన ఆలయ ఈవో రమాదేవి.



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 12 (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 14 నుంచి 23వ తేదీ వరకు వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పది రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ప్రధాన ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఏకాంతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పవిత్ర క్రతువులు నిర్వహించనున్నారు. భక్తుల దర్శనార్థం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ మండపంలో ప్రత్యేక గణపతి మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మండపాన్ని రంగురంగుల పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించి భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. శ్రీ భీమేశ్వర ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) రమాదేవి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా భద్రత, పారిశుద్ధ్యం, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈవో వెంట దేవస్థాన డీఈ రామ్‌కిషన్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, ఆలయ సిబ్బంది, అర్చకులు, వేద పండితులు, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది తదితరులు పాల్గొన్నా





# ఎస్ ఐ ఆర్ హియరింగ్‌పై సారపాకలో గ్రామ సభ

## నోటీసులు అందుకున్న ఓటర్లు ఆధారాలు సమర్పించాలి అధికారులు

అరుణ ప్రభ:- సారపాక, సెప్టెంబర్ 12: తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా సారపాక గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఎస్ ఐ ఆర్ హియరింగ్ గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ శ్రీ గుగులోత్ శివరాం నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మార్వో ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఈఓ జి. రవికుమార్ పాల్గొని ఓటర్లకు పలు సూచనలు చేశారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా నోటీసులు అందుకున్న వారు ఆధార్ కార్డుతో పాటు నోటీసులో సూచించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో తమకు వర్తించే ఆధారాలను సమర్పించాలని అధికారులు సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 13 నుంచి పోలింగ్ స్టేషన్ నంబర్లు 195 నుంచి 218 వరకు బీఎల్‌ఓలు సారపాక గ్రామపంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని అధికారులు వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీపీఓ ప్రసాద్, బూర్గంపాడు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి, ఐఎన్టియుసి జిల్లా కార్యదర్శి పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు తిరుపతి ఏసోబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి చంటి, భూక్య లక్ష్మణ్, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మట్టి వినాయకులను ప్రజలకు పంపిణీ

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులే మేలు మాజీ కౌన్సిలర్ పిల్లనగ్రోవి సంజయ్ యాదవ్

అరుణ ప్రభ -- శంషాబాద్ జోన్ శంషాబాద్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ శంషాబాద్ జోన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన మట్టి వినాయక ప్రతిమలను మాజీ కౌన్సిలర్ పిల్లనగ్రోవి సంజయ్ యాదవ్ ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలని సూచించారు. మట్టి విగ్రహాలను ఉపయోగించడం వల్ల నిమజ్జనం సమయంలో నీటి కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలు మట్టి గణపతులను ప్రోత్సహించాలని, రసాయనాలు కలిగిన విగ్రహాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. పర్యావరణ హితమైన వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రతి కార్యకర్తకు స్ఫూర్తి

## ప్రజల మధ్య ఉంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి.

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 12: గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన ప్రజాసేవా ప్రస్థానం నుంచి భారత ప్రధానమంత్రిగా 25 ఏళ్లుగా నిరంతరం ప్రజాసేవ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ సేవా ప్రస్థానం ప్రతి బీజేపీ కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో 'సేవా సంకల్ప్ అభియాన్' జిల్లా కార్యశాల నిర్వహించారు. సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ శ్రేణులకు రానున్న కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు దాదాపు నెల రోజుల పాటు రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో తొమ్మిది ప్రధాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని ప్రజాక్షేత్రంలో నిరంతరం ఉండాలని సూచించారు. ప్రజల మధ్య ఉంటూ పనిచేసే కార్యకర్తలే భవిష్యత్తులో నాయకులుగా ఎదుగుతారని అన్నారు. ప్రతి కార్యకర్త గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, వాటి పరిష్కారం కోసం పోరాడాలని గోపి పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ అప్పగించిన కార్యక్రమాలను సమన్వయంతో, క్రమశిక్షణతో విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ కార్యక్రమాలను అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజల్లో పార్టీకి మరింత ఆదరణ పెంచాలని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం దూరం కాదని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లోనూ బీజేపీ జెండా ఎగురవేసేలా ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు బీజేపీలో రాజకీయంగా ఎదగడానికి మంచి అవకాశాలు ఉన్నాయని గోపి తెలిపారు. ప్రజాక్షేత్రంలో నిరంతరం పనిచేసే కార్యకర్తలే భవిష్యత్తులో నాయకులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలి. జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ ఇచ్చిన నెల రోజుల కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమయాన్ని కేటాయించి క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని భరోసా ఇచ్చారు. మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా స్ఫూర్తితో ప్రతి కార్యకర్త ప్రజల కోసం పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ దశరథం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బర్కం లక్ష్మి, శీలం రాజు, మల్లారపు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మిస సంజీవ్, జిల్లా



ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఉడుగుల యాదగిరి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్‌తో పాటు రాష్ట్ర, జిల్లా పదాధికారులు, వివిధ మండలాల అధ్యక్షులు, మండల పదాధికారులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోర్ అర్బన్ రీజియన్ బిల్లు
# హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి చారిత్రాత్మక ముందడుగు

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో కూడిన నాయకత్వంలో హైదరాబాద్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, ప్రపంచస్థాయి మహానగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో లిలికోర్ అర్బన్ రీజియన్ బిల్లు–2026ను ప్రభుత్వం తీసుకువచ్చింది.

- 70 ఏళ్ల క్రితం రూపొందించిన లిలి1955 మున్సిపల్ చట్టంలిలి నేటి హైదరాబాద్ అవసరాలకు సరిపోదు. 21వ శతాబ్దపు హైదరాబాద్‌కు ఆధునిక సమగ్ర పాలనా వ్యవస్థ అవసరం.
- జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరిలిలి ప్రాంతాలను కలుపుతున్న కోర్ అర్బన్ రీజియన్ పరిధి రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ప్రధాన ఇంజిన్‌గా మారింది. ఈ ప్రాంతానికి అనుగుణంగా పాలనా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉంది.
- ట్రాఫిక్, వరదలు, చెరువులు, మూసీ కాలుష్యం, డ్రైనేజీ, రోడ్లు, ప్రజా సదుపాయాల వంటి సమస్యలు కార్పొరేషన్ సరిహద్దులను దాటుతున్నాయి. సమస్యలు సమగ్రంగా ఉంటే పరిష్కారాలు కూడా సమగ్రంగానే ఉండాలి.
- మూడు కార్పొరేషన్ల స్థానిక పరిపాలన కొనసాగుతూనే, కోర్ అర్బన్ రీజియన్ స్థాయిలో శాఖల మధ్య సమన్వయాన్ని చట్టబద్ధం చేయడం బిల్లులో కీలక అంశం.
- ట్రాఫిక్, రహదారి భద్రత, విపత్తుల నిర్వహణ, చెరువుల పరిరక్షణ, ప్రజా సదుపాయాల పనుల సమన్వయం కోసం ప్రత్యేక సంస్థలు ఏర్పాటు చేయడం ద్వారా “సమన్వయ లోపం” అనే ప్రధాన సమస్యకు పరిష్కారం చూపనున్నారు.
- జీఐఎస్, ఏఐ, డ్రోన్లు, ఐఓటీ, సీసీటీవీ, రియల్‌టైమ్ డేటాలిలి వంటి సాంకేతికతను ఉపయోగించి స్మార్ట్, డేటా ఆధారిత పాలనకు బిల్లు మార్గం చూపుతుంది.
- ప్రజలు ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే డిజిటల్ పోర్టల్, సమగ్ర బిల్లింగ్, ఆన్‌లైన్ అనుమతులు వంటి విధానాలు తీసుకురానున్నారు.
- నిర్మాణ అనుమతులు, వ్యాపార అనుమతులు వంటి సేవల్లో నిర్ణీత గడువులు, లిలిడీమ్డ్ అప్రూవల్‌లిలి వంటి సంస్కరణల ద్వారా వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యం.
- మూసీ, చెరువులు, నాలాలు, పచ్చదనం, వాతావరణ మార్పు అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత.
- అనధికార నిర్మాణాలు, అక్రమ ప్రకటనలు, నిబంధనల ఉల్లంఘనలపై లిలిసివిల్ పెనాల్టీలిలి విధానం, అప్పీల్ వ్యవస్థ ద్వారా జవాబుదారీతనం పెంపొందించనున్నారు.
- పాతబడిపోయిన, కాలానుగుణంగా అనవసరమైన నిబంధనలను తొలగించి, ఆధునిక నగర పాలనకు అవసరమైన చట్టపరమైన వ్యవస్థను ఈ బిల్లు అందిస్తుంది.
- ముఖ్యంగా, సమగ్ర పాలన అంటే కేంద్రీకరణ కాదు --- వికేంద్రీకరణతో కూడిన సమన్వయం. వార్డు స్థాయి పాలనను కొనసాగిస్తూ కోర్ అర్బన్ రీజియన్ స్థాయిలో సమన్వయాన్ని బలోపేతం చేయడం ఈ బిల్లు ప్రత్యేకత.
- హైదరాబాద్‌ను కేవలం విస్తరిస్తున్న నగరంగా కాకుండా ప్రపంచస్థాయి, సురక్షితమైన, స్మార్ట్, పర్యావరణహిత మహానగరంగా తీర్చిదిద్దేందుకు లిలికోర్ అర్బన్ రీజియన్ బిల్లు--2026లిలి కీలక అడుగు.
- “1955 చట్టం హైదరాబాద్ గతానికి పునాది అయితే --- కోర్ అర్బన్ రీజియన్ బిల్లు--2026 హైదరాబాద్ భవిష్యత్తుకు పునాది.”

# కేజీహెచ్‌లో 23.75 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం







విశాఖపట్నం, అరుణ ప్రభ న్యూస్ సెప్టెంబర్ 12: కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్) ప్రాంగణంలో రూ.23.75 కోట్ల వ్యయంతో నాలుగు అంతస్థుల్లో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ)ను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి. నడ్డా శనివారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కేజీహెచ్‌లో నిర్వహించిన వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ కేజీహెచ్ చరిత్రలో క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం ఒక మైలురాయిగా నిలిచి పోతుందన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, సౌకర్యాలతో ఈ బ్లాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా లేని స్థాయి అత్యాధునిక పరికరాలు ఇక్కడ ఏర్పాటు చేశారన్నారు. ఉత్తరాంధ్రలోని పేద, మధ్యతరగతి ప్రజలకు కేజీహెచ్ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య ప్రదాయినిగా నిలుస్తోందన్నారు. ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తే లక్షలాది మంది పేదలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో కేజీహెచ్‌లో ఓపీ బ్లాక్‌తో పాటు అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులను కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యమని, అందుకు అనుగుణంగా కేజీహెచ్‌ను మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్. పరశురామరాజు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి, ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ, కేజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదం.. అట్రాసిటీ కేసుకు డిమాండ్ : ముప్పిడి గోపాల్

## అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బేగంపేట్ పోలీసులను ఆశ్రయించిన ముప్పిడి గోపాల్



స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు, పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను డిమాండ్ చేశారు. అంతేకాకుండా, సంబంధిత ఎమ్మెల్యేను పదవి నుంచి తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు బేగంపేట్ సీఐని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సామాజికంగా ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉన్నందున, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఏపిటిఎస్ డైరెక్టర్ ముప్పిడి గోపాల్, పోడేటి రాజు, నరేష్, శ్రీనివాస్, సాగర్, సాంసన్ రాజు, సలీం, తోఫిక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# విశాఖలో కాలిబూడిదైన ఆర్టీసీ బస్సు.. తప్పిన పెను ప్రమాదం

## విశాఖ వాల్తేరు డిపో సమీపంలో ఘటన
## నెల్లూరు నుంచి వచ్చిన బస్సులో అకస్మాత్తుగా మంటలు
## ఇంజిన్‌లో మొదలై నిమిషాల్లోనే వ్యాపించిన అగ్నికీలలు
## ప్రయాణికులు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం



విశాఖపట్నంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నగరంలోని వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచిన ఏపీఎస్ఆర్టీసీ బస్సు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకోగా, ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి నెల్లూరు నుంచి ప్రయాణికులతో వచ్చిన ఈ బస్సును వాల్తేరు డిపో వద్ద నిలిపి ఉంచారు. అయితే, శనివారం తెల్లవారుజామున బస్సు ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా పొగలు వెలువడ్డాయి. చూస్తుండగానే నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయినప్పటికీ అప్పటికే బస్సు పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రయాణికులు లేని సమయంలో ఈ ఘటన జరగడంతో పెను ముప్పు తప్పినట్లయిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



# గణేష్ మండపాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

## ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు
## నిర్వహించేందుకు పోలీసులకు సహకరించాలి: ఎస్ఐ మేడా ప్రసాద్

అరుణ ప్రభ:– బూర్గంపాడు రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు గణేష్ మండపాల నిర్వాహకులు, మండల సర్పంచులతో ఎస్ఐ మేడా ప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులకు పలు భద్రతా సూచనలు, మార్గదర్శకాలను వివరించారు. గణేష్ మండపాల నిర్వాహకులు ముందుగానే పోలీస్ పోర్టల్‌లో మండపానికి సంబంధించిన వివరాలను నమోదు చేసి, తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్ఐ సూచించారు. మండపాలకు విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రతి మండపం వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక బకెట్లు, నీటి వసతి లేదా ఫైర్ ఎక్స్టింగ్విషర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. మండపాల వద్ద, గణేష్ ఊరేగింపుల్లో డీజేలు వినియోగించరాదని తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ డీజేలు వినియోగించకూడదని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా లేదా రెచ్చగొట్టేలా ఉండే పాటలు, నినాదాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ మేడా ప్రసాద్ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. “నిబంధనలు పాటిద్దాం.. ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు నిర్వహిద్దాం”



# దేవరకొండ పెన్షనర్స్ సేవా సదనంలో జన్మదిన వేడుకలు

అరుణ ప్రభ, దేవరకొండ డివిజన్, సెప్టెంబర్ 12 ,దేవరకొండ పెన్షనర్స్ సేవాసదనములో శనివారం జిల్లా కార్యవర్గ సభ్యులు బో లుసాని సత్యనారాయణ, మహమ్మద్ మౌలానా కార్యవర్గ సభ్యులు జన్మదిన వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంలో సత్యనారాయణ వికలాంగురాలకు 500 రూపాయలు అందజేసినారు. హాజరైన సభ్యులకు మిఠాయి, తేనీరు అందజేసినారు. జన్మదిన వేడుకలను నిర్వహిం చుకున్న వారు మాట్లాడుతూ, మా పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం సంతోషదా యకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి లింగయ్య ,జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, నిర్వాహక కార్యదర్శి యూసుఫ్ షరీఫ్, పురుషోత్తం ,నందులాల్, ఆలంపల్లి శ్రీనివాసులు, నక్క కొండయ్య ,తదితర సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలియ చేసినారు.




# నిజమైన మహిళా సాధికారత అంటే అదే

## ఆర్ఎక్స్ఎస్ జెర్సీ ఆవిష్కరణ ఈవెంట్ లో రాయపాటి శైలజ
## కడపలో ఘనంగా ఆర్ఎక్స్ఎస్ మహిళా క్రికెట్ జట్టు జెర్సీ ఆవిష్కరణ
## ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ
## బ్రాండ్ అంబాసిడర్, సినీ నటి నిధి అగర్వాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు
## మహిళా క్రీడాకారులను సమాజం ప్రోత్సహించాలని శైలజ పిలుపు
## రాయలసీమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా జెర్సీ రూపకల్పన

మహిళా క్రికెట్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్న తరుణంలో, వారికి కుటుంబం, సమాజం నుంచి మరింత ప్రోత్సాహం అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. కడపలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం జరిగిన ఆర్ఎక్స్ఎస్ (=శూ) మహిళా క్రికెట్ జట్టు జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో జట్టు బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మాట్లాడుతూ, మహిళా క్రికెట్‌కు గుర్తింపు లభించడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారిణులను గుర్తించి, వారిని ఉన్నత స్థాయికి చేరేలా అండగా నిలవాలని సూచించారు. “ఒక అమ్మాయి తాను ఇష్టపడిన రంగంలో రాణించేలా ప్రోత్సహించి, చివరి వరకు తోడుగా నిలవడమే నిజమైన మహిళా సాధికారత” అని ఆమె వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరింత మంది క్రీడాకారిణులు భారత జాతీయ జట్టులో చోటు సంపాదించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఆర్ఎక్స్ఎస్ జట్టు మరిన్ని విజయాలు సాధించాలని ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జట్టు బ్రాండ్ అంబాసిడర్ నిధి అగర్వాల్ సందడి చేశారు. ఆమె జెర్సీని ఆవిష్కరించి, జట్టు సభ్యులకు అభినందనలు తెలిపారు. “రాయలసీమ స్ఫూర్తి”ని ప్రతిబింబించేలా ఈ జెర్సీని రూపొందించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై, క్రీడాకారిణులను ఉత్సాహపరిచారు.



అక్కడికెళ్తే మీ కష్టాలు తీరుతాయ్.. ప్రశాంత దొరుకుతుంది. పుణ్యం, మోక్షం,భక్తి , ఆహ్లాదంతో కూడుకున్న క్షేత్రమే అన్నవర సత్యనారాయణస్వామి పుణ్య క్షేత్రం. భక్తులు ఎంతో భక్తి పారవశ్యంతో కోరితే కష్టాలు తీరుస్తాడనే నమ్మకంతో అన్నవర సత్యనారాయణ స్వామిని దర్శించుకుంటారు. దేశ నలుమూలల స్వామివారు పేరుగాంచి ఉన్నారు. ఇక్కడ స్వామి వారు వెలిసి శతాబ్ధి కాలమే అవుతున్నా.. అంతకు మించి పేరు ప్రఖ్యాతలు వచ్చి చేరాయి. పిలిస్తే పలికే దైవంగా పేరుపొందిన శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రత్నగిరి అనే కొండపై అన్నవరంలో నిర్మించారు. సమీపంలో పంపా నది హొయలొలుకుతూ పారుతుంటుంది. కొండపై నెలకొని ఉన్న ఈ దేవాలయంలో వేంచేసి ఉన్న శ్రీ సత్యనారాయణ స్వామిని దర్శించేందుకు గుడివరకు ఘాట్ రోడ్డు నిర్మించారు. మెట్ల గుండా కూడా వెళ్ళవచ్చు. ఇక్కడ సామూహికంగా వందలాది దంపతులు కూర్చుని ఒకేసారి సత్యనారాయణస్వామి వ్రతాన్ని కనుల పండువగా చేసికొంటూ ఉండటం ఒక ప్రత్యేకత ఇలాంటి సుందర భక్తి పారవశ్య దృశ్యాన్ని ప్రతి ఒక్కు చూసి తీరాల్సిందే. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు పెళ్లైన కొత్త జంటలన్ని అన్నవరం వెళ్లి సత్యనారాయణస్వామి వ్రతం చేయించుకుంటారు.





## అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం

పంపా నది ఒడ్డున ఉన్న రత్నగిరి మీద ఈ ఆలయం సముద్ర మట్టానికి 300 అడుగుల ఎత్తులో ఉంది. ఈ గుడికి పాదచారులు చేరు కోవడానికి 460 మెట్లు ఉన్నాయి. ప్రధాన ఆలయం రథాకారంలో ఉండి, నాలుగు దిక్కులలో నాలుగు చక్రాలతో ఉంటుంది. ప్రధాన ఆలయానికి ఎదురుగా కళ్యాణ మండపం ఉంటుంది. ఈ కళ్యాణ మండపం ఆధునిక నిర్మాణ చాతుర్యానికి ఒక మచ్చుతునక. వనదుర్గ ఆలయం, రామాలయాలు ప్రక్కన కనిపిస్తూ ఉంటాయి. ఆలయ రూపం, అగ్ని పురాణంలో చెప్పబడినట్లు, ప్రకృతిని తలపిస్తూ ఉండాలి."





## ద్రాక్షారామం మరింత ప్రసిద్ధి

ఆంధ్రప్రదేశ్ లో "పంచరామాలు" అనే ఐదు ప్రసిద్ధ శైవ క్షేత్రాలు ఉన్నాయి. అవి వరుసగా అమరావతి లోని అమరారామము, భీమవరం లోని సోమారామము, పాలకొల్లు లోని క్షీరారామము, తూర్పు గోదావరి జిల్లా లోని ద్రాక్షారామము మరియు సామర్లకోట లోని కుమారారామము గా ఉన్నాయి. ఇందులో రెండు క్షేత్రాలు తూర్పుగోదావరి లోనే ఉన్నాయి. వీటిలో ద్రాక్షారామం మరింత ప్రసిద్ధి చెందంది. ఇక్కడికి కొన్ని వేళమంది భక్తులు సందర్శిస్తుంటారు. తన భర్తకి ఆహ్వానం లేకపోయినప్పటికీ పుట్టింటిపై ప్రేమతో ఆ యజ్ఞానికి వచ్చి అవమానంపాలైన పరమశివుని సతి సతీదేవి ఆత్మాహుతి చేసుకున్న ప్రదేశం ఇదే. ద్రాక్షారామంలో శివుడు భీమేశ్వరుడిగా స్వయంభువుగా అవతరించాడు. శ్రీ లక్ష్మీనారాయణుడు ఈ క్షేత్రానికి క్షేత్ర పాలకుడిగా ఉన్నాడు. ద్రాక్షారామం త్రిలింగ క్షేత్రాలలో ఒకటిగా పంచారామాల్లో ఒకటిగా దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది. ఈ క్షేత్రాన్ని గురించి శ్రీనాథ కవి సార్వభౌముడు తన కావ్యాల్లో పేర్కొన్నాడు. ఇక్కడి స్వామివారిని అభిషేకించడానికి సప్తఋషులు కలిసి గోదావరిని తీసుకు వచ్చారనీ పురాణ కథనాలు వర్ణిస్తున్నాయి.అందువలన అంతర్వాహినిగా ప్రవహించే ఈ గోదావరిని సప్త గోదావరి' అని పిలుస్తూ వుంటారు. ఇక్కడి పంచలోహ విగ్రహాలు తామ్ర మూర్తులు 8 వ శతాబ్దం నుంచి ఉన్నవిగా భావిస్తున్నారు.







# ప్యారడైజ్ నా కెరీర్‌లోనే ఎక్కువ కష్టపడి చేసిన సినిమా

## : న్యాచురల్ స్టార్ నాని

న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో న్యాచురల్ స్టార్ నాని మాట్లాడుతూ ఆయా షేర్, ఏష నాగుల కట్ట, గ్లింప్స్, టీజర్.. సినిమా నుంచి ఏ కంటెంట్ ఇచ్చినా సరే అన్నిటికీ ఆడియన్స్ బ్రహ్మరథం పట్టారు. మీరు సినిమాని అంతగా సొంతం చేసుకున్నట్టు చూస్తుంటే మా బాధ్యత ఇంకా పెరుగుతుంది. ఈ సినిమాకి ఒక డెస్టినీ ఉంది అనే బలమైన నమ్మకం వచ్చింది. సెప్టెంబర్ 24న ఆడియన్స్‌కి ఒక అద్భుతమైన అనుభూతిని అందించడానికి నిద్రాహారాలు లేకుండా పనిచేస్తున్నాం. మా టార్గెట్ ఒకటే. మీరందరూ చాలా అంచనాలతో థియేటర్‌కి వస్తారని తెలుసు. మీకు ఫస్ట్ నుంచి చివరి వరకు ఒక అడ్రినలిన్ పంపింగ్, హై ఇచ్చి ఇంటికి పంపించాలనేది మా తపన. మేమందరం దానికోసం కష్టపడుతున్నాం అన్నారు. డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ.. నా 'సినిమా' అనేకంటే 'జనం సినిమా' అనడం కరెక్ట్ అని నాకు అనిపిస్తుంది. అంతలా ఈ కంటెంట్‌ను ఆదరించారు. ఇది రెవల్యూషనరీ ఎమోషనల్ ఫిలిం. ఒక తల్లి, కొడుకుల కథ. ఒక సవారీ జాతి కథ. "పుట్టుక మనది, చావు మనది, బతుకంతా దేశానిది" అని కాళోజీ గారి మాట ఉంటుంది. ఆ దేశం కోసం కొట్లాడిన వారిని ఆ దేశంతోనే సంబంధం లేదు అంటే.. వాళ్లందరూ ఏం చేయాలో తెలియక, మరుగునపడ్డ జాతి కథ. 'ది ప్యారడైజ్' కథ ఏమిటో అవగాహన కోసం ఇది చెప్తున్నాను అన్నారు.

# హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌తో మంచు మనోజ్ దంపతులు భేటీ



టాలీవుడ్ నటుడు మంచు మనోజ్, ఆయన సతీమణి మౌనిక భూమా మంచు తమ వ్యాపార ప్రస్థానాన్ని మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా వీరిద్దరూ న్యూ ఢిల్లీలోని హిమాచల్ సదన్‌లో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శ్రీ కవిందర్ గుప్తాను కలిశారు. ఈ సందర్భంగా సినిమా, స్పోర్ట్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. వినోద రంగంతో పాటు క్రీడా రంగంలోనూ కొత్త అవకాశాలను అన్వేషిస్తున్న మంచు మనోజ్, మౌనిక భూమా మంచు.. తమ వ్యాపార దృష్టిని మరింత విస్తరించే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం చర్చించిన ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించలేదు.

దీంతో ఈ భేటీ వెనుక ఉన్న అసలు ప్రణాళికలపై ఆసక్తి నెలకొంది. సినిమా నిర్మాణం, స్పోర్ట్స్‌కు సంబంధించిన మౌలిక వసతులు, క్రీడా అవకాశాలు వంటి విభాగాల్లో పెద్ద స్థాయి ప్రాజెక్టులపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.



# రామ్ పోతినేని సరసన సంయుక్త

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ప్రతిష్టాత్మక #RAPO23లో ఎక్సయిటింగ్ స్టార్ చేరారు. టాలెంటెడ్ హీరోయిన్ సంయుక్త ఈ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసిన మేకర్స్.. టాలీవుడ్ లక్కీ చార్మ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ బర్త్‌డే పోస్టర్ సంయుక్తకు టీమ్ తరఫున శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు.. ఆమె ఈ సినిమాలో భాగమైన విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఆమె చేరికతో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్యూరియాసిటీ పెరిగింది. #RAPO23ను నియో-నోయిర్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. #RAPO23తో రామ్ పోతినేని దర్శకుడిగా తొలిసారి పరిచయం అవుతున్నారు. తన విజన్‌ను తెరపైకి తీసుకొచ్చే బాధ్యతను ఆయనే పూర్తిగా తీసుకున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

# శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న లాస్ట్ బెంచ్ డైరీ



ఎస్.ఆర్.ఎస్. మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్-3గా తెరకెక్కుతున్న 'లాస్ట్ బెంచ్ డైరీ' చిత్రం షూటింగ్ అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రాన్ని గురువులకు అంకితం చేస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. సెప్టెంబర్ 5న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజా కార్యక్రమాలతో చిత్రీకరణను ప్రారంభించారు. ఇప్పటికే గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న పొట్టి మామ కామెడీ సన్నివేశాలతో పాటు, విలన్ పాత్రలో మారుతి సకాలం నటిస్తున్న ఉద్వేగభరితమైన కీలక సన్నివేశాలను పూర్తి చేశారు. ఈ చిత్రానికి రూప శ్రీ నిర్మాతగా, చంద్రమౌళి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహిస్తున్నారు. విద్య అనేది ఒక ఆయుధం, దాన్ని పొందడం ఒక వరం అనే సందేశంతో పాటు తల్లిదండ్రులు, గురువుల విలువలను తెలియజేసేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. హాస్యనటులుశ్రీ సునీల్ రావినూతల ఒక హాస్య సన్నివేశంలో నటించారు. హీరో కొలిమి పక్కీరయ్య అలియాస్ శివరామశాస్త్రి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాల్లో విద్య ఎంతటి ముఖ్యమైన పాత్ర పోషిస్తుందో ఈ సినిమాలో చూపిస్తున్నామని, మంచి సందేశంతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని అన్నారు. కెమెరామెన్ గణేష్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ చెన్నూరు సంగీతం సమకూరుస్తున్నారు. లక్కిరెడ్డిపల్లి పరిసర గ్రామీణ ప్రాంతాల్లో స్థానికుల సహకారంతో తొలి షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసే దిశగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'లాస్ట్ బెంచ్ డైరీ' తెరకెక్కుతోందని చిత్ర యూనిట్ పేర్కొంది.



# తండ్రి ప్రేమను చాటిచెప్పే అమ్మ ప్రేమ పంచు నాన్నే

మహారత్న ప్రొడక్షన్స్, ఎస్‌కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ప్రేమనే ఊరిలో'. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివ, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. రీసెంట్‌గా ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేయగా అందరిలోనూ ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసింది. ఇక తాజాగా ఈ సినిమా నుంచి 'అమ్మ ప్రేమ పంచు నాన్నే' అంటూ సాగే అందమైన పాటను రిలీజ్ చేశారు. రాంబాబు గోసాల రాసిన సాహిత్యం, సునాద్ గౌతమ్ అందించిన బాణీ ప్రధాన ఆకర్షణ కానుంది. రామ్ మిర్యాల గాత్రం మేజర్ అస్సెట్‌గా నిలిచింది. తండ్రి ప్రేమను చాటేలా సాగే ఈ పాట అందరినీ ఎమోషనల్‌గా టచ్ చేసేలా ఉంది. ఈ లిరికల్ వీడియోలో చూపించిన ఎమోషనల్ సీన్స్, గ్రామీణ వాతావరణం అందరినీ ఆకట్టుకునేలా ఉంది.

CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889